E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 06-05-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:124 || పేజీలు–6
www.ekaburu.com

మే 9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం

03

గౌలిదొడ్డి అక్రమ క్రషర్ల పాపం పండింది

అనుమతి లేని క్రషర్లు, ఆర్ఎంసి ప్లాంట్లపై హైడ్రా యాక్షన్
పీసీబీ, మైనింగ్ శాఖల ఫిర్యాదుతో ఒకే రోజు 4 చోట్ల హైడ్రా ఆపరేషన్లు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : ""సహజసిద్ధమైన కొండల్ని చెరబట్టి పిండి చేశారు... చిట్టడవిని తలపించే విధంగా ఉన్న గుట్టలను ఎలాంటి అనుమతి లేకుండా ధ్వంసం చేశారు... రాత్రీ పగలూ తేడా లేకుండా క్రషింగ్ చేసి, దుమ్ము రేపుతూ వాయు కాలుష్యానికి కారణమయ్యారు... ఈ ప్రకృతి విధ్వంసమంతా ఓఆర్ ఆర్ లోపలా.. అందులోనూ ఐటీ కారిడార్ పరిధిలో జరిగింది... చివరికి పీసీబీ, రెవెన్యూ, మైనింగ్ శాఖల ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగడంతో ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్న అక్రమ క్రషర్లు ఆర్ఎంసి ప్లాంట్ల పాపం పండింది... అక్రమంగా నడుస్తున్న క్రషింగ్ యూనిట్లతో పాటు. వర్కింగ్ లైసెన్సు లేని ఆర్ ఎం సీ (రెడీ మిక్స్ కాంక్రీట్) యూనిట్లను సైతం హైడ్రా తొలగించింది. భవిష్యత్తులో అక్కడ మరోసారి స్టోన్ క్రషింగ్ చేయడానికి వీలు లేకుండా పరికరాలను నేలమట్టం చేసింది.""

మిగతా 2లో

03

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే

.. మోదీ వచ్చేలోపు బండి సంజయ్ ఆన్సర్ చెప్పాలి: మహేష్ కుమార్ గౌడ్

ఈ-కబురు హైదరాబాద్ ; తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ,

03

జైశ్రీరామ్ అంటే.. పైనుంచి పైసలు పడుతున్నాయా?

మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు

ఈ-కబురు హైదరాబాద్; తెలంగాణ రాజకీయాల్లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన

03

గో బ్యాక్ మోదీ అంటూ.. ప్రధాని పర్యటన పై కాంగ్రెస్ నిప్పులు

ఈ-కబురు, హైదరాబాద్ : దేశ ప్రధాని రాష్ట్ర పర్యటనకు వస్తున్న తరుణంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా

'కాళేశ్వరం'పై బీఆర్ఎస్ –బీజేపీ లాలూచీ

తడిసిన ప్రతి ధాన్యం గింజనూ కొంటాం
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
హనుమకొండలో రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా ప్రారంభం

ఈ-కబురు, వరంగల్: కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై కమిషన్ విచారణ జరిపి అవినీతి జరిగిందని నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అప్పగించి తొమ్మిది నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బీజేపీబీఆర్ఎస్ మధ్య లాలూచీ రాజకీయాలకు నిదర్శనమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

మిగతా 2లో

ఖతార్ గగనతలంలో అమెరికా 'గ్యాస్ స్టేషన్' మిస్సింగ్..!

02

రేపే విజయ్ ప్రమాణం?

- ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
- గవర్నర్‌కు టీవీకే అధినేత విజయ్ లేఖ
- టీవీకే మా మద్దతు కోరింది: కాంగ్రెస్
- నిర్ణయం రాష్ట్ర నేతలకే వదిలేశామని వెల్లడి

ఈ-కబురు,,చెన్నై, దిల్లీ

: తమిళనాడు ముఖ్యమంత్రిగా సినీనటుడు, టీవీకే అధినేత విజయ్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7న (గురువారం) ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు తమ పార్టీని ఆహ్వానించాలని గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ కార్యాలయానికి విజయ్ లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక 15రోజుల్లో అసెంబ్లీలో బలం నిరూపించుకుంటామని తెలిపారు. కేరళ పర్యటనలో ఉన్న గవర్నర్ బుధవారం చెన్నైకి తిరిగి వచ్చే అవకాశముంది. ఆ వెంటనే విజయ్ బృందం గవర్నర్‌ను కలిసి నూతన ప్రభుత్వ ఏర్పాటుపై చర్చిస్తారని టీవీకే వర్గాలు వెల్లడించాయి.

మిగతా 2లో

మెట్రో రెండో దశకు అనుమతులివ్వండి

02

కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ
నేడు దిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఈ-కబురు,, హైదరాబాద్: మెట్రోరైలు రెండో దశకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా కేంద్రానికి లేఖ రాసింది. హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రాజెక్ట్‌లో వందశాతం షేర్ల కొనుగోలుతో ప్రాజెక్ట్‌ను గత నెల 30న ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలుపుతూ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు..

ఇది కుంభకోణాల్లో కూరుకుపోయిన ప్రభుత్వం

పౌరసరఫరాలశాఖలో పెద్దఎత్తున అక్రమాలు
సీబీఐ విచారణకు కేటీఆర్ డిమాండ్

ఈ-కబురు,నర్సంపేట, :

కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల్లో కూరుకుపోయిందని, భాజపాకు చిత్తశుద్ధి ఉంటే పౌరసరఫరాల కార్పొరేషన్‌లో జరిగిన అవకతవకలపై సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్

మిగతా 2లో

రాజీనామా చేయను

అది ప్రజల తీర్పు కాదు కుట్రల ఫలితమే
మమతా బెనర్జీ స్పష్టీకరణ
సామాన్యురాలినయ్యానని వ్యాఖ్య
మళ్లీ వీధి పోరాటాలకు దిగుతానని వెల్లడి
రాజీనామా చేయకపోతే ప్రభుత్వాన్ని గవర్నర్ రద్దు చేసే అవకాశం
కోల్‌కతా

మిగతా 3లో

ఏరోస్పేస్ దిగ్గజాలకు వ్యూహాత్మక భాగస్వామిగా తెలంగాణ

ఐటీపీ ఏరోఇండియా ఉత్పత్తి కేంద్రం భూమిపూజలో మంత్రి శ్రీధర్‌బాబు

03

శాంసన్ దంచెన్.. దిల్లీపై చెన్నై ఘనవిజయం ..రాణించిన నూర్, హూసేన్, కార్తీక్

06

మెట్రో రెండో దశకు అనుమతులివ్వండి

కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. ప్రభుత్వం మెట్రోను స్వాధీనం చేసుకోవడంతో ఇప్పటివరకు కేంద్రం లేవనెత్తిన అభ్యంతరాలు తొలగిపోయాయని.. ఇకనైనా రెండోదశ ఎ, బి భాగంలోని ఏడు మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) లను ఆమోదించాలని లేఖలో కోరారు. ఇదే విషయంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ ఖట్టర్‌ను కలవడానికి బుధవారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయం నుంచి దిల్లీకి వెళ్లనున్నారు. మెట్రో మొదటి దశ స్వాధీనం గురించి వివరించి.. రెండోదశను సత్వరం ఆమోదించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున వినతిపత్రాన్ని అందజేయనున్నారు. ఈ నెల 10న ప్రధానమంత్రి హైదరాబాద్ రానుండడంతో..ఆ పర్యటనలోనూ మెట్రో రెండోదశ విస్తరణతో పాటు.. రాష్ట్రానికి రావాల్సిన పలు అంశాలపై మోదీని కలిసి సీఎం వివరించనున్నారు.

ఏడాదిన్నరగా ఎదురుచూపులు...

మెట్రో రెండోదశ ప్రతిపాదనలు, డీపీఆర్‌లను 2024 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో తలపెట్టిన రెండోదశకు అనుమతి ఇవ్వాలంటే.. ఆపరేషన్ పరంగా సమన్వయం కోసం మొదటి దశ ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీతో కచ్చితమైన ఒప్పందం చేసుకోవాలని కేంద్రం మెలిక పెట్టింది.ఇప్పుడు ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో పగ్గాలు సర్కారు చేతికి రావడంతో.. కేంద్ర అభ్యంతరాలు తొలగిపోయాయి.మొదటి దశ, రెండో దశ సర్కారు యాజమాన్యంలో ఉండబోతున్నాయి.ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన రుణాలు ఇచ్చేందుకు జైకా, ఏడీబీ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించినందున కేంద్ర అనుమతులు కీలకంగా మారాయి.

పార్టీ అగ్ర నేతలతోనూ భేటీ

ముఖ్యమంత్రి దిల్లీ పర్యటనలో మరికొందరు కేంద్ర మంత్రులను కూడా కలిసే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కూడా కలవవచ్చని తెలుస్తోంది. ఇటీవల కేరళ ఎన్నికల్లో యూడీఎఫ్ విజయం సాధించిన నేపథ్యంలో.. ఆ రాష్ట్రానికి చెందిన ఎంపీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపే అవకాశముంది.

ఇది కుంభకోణాల్లో కూరుకుపోయిన ప్రభుత్వం

ఈకబురు,నర్సంపేట, : కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల్లో కూరుకుపోయిందని, భాజపాకు చిత్తశుద్ధి ఉంటే పౌరసరఫరాల కార్పొరేషన్‌లో జరిగిన అవకతవకలపై సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్లోని మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని ముత్తోజిపేటకు వెళ్లి ఇటీవల ఆత్మబలిదానం చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. భారాస తరఫున రూ.5 లక్షల నగదు అందించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లోపభూయిష్టమైన విధానాలు అనుసరిస్తూ పౌరసరఫరాల కార్పొరేషన్ నెత్తిన రూ.లక్షల కోట్ల అప్పు మోపిందన్నారు. మార్క్‌ఫెడ్‌ను ముందుపెట్టి రూ.22వేల కోట్ల అప్పు తెచ్చి ధాన్యం కొనుగోళ్లకు మళ్లించిందని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి మూటలు పంపడం మానేసి, అన్నదాతలకు రైతుబంధు ఇవ్వడం.. మక్కలు, ధాన్యం కొనుగోళ్లపై దృష్టి పెట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కుంభకోణాలు చేస్తుంటే భాజపా కాపాడుతోందని.. పౌరసరఫరాల కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలపై తమ పార్టీ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేశాడని చెప్పారు. సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, సిరికొండ మధుసూదనాచారి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, మాలోతు కవిత పాల్గొన్నారు.

గౌలిదొడ్డి అక్రమ క్రషర్ల పాపం పండింది

గౌలిదొడ్డి అక్రమ ఆర్ఎంసి, క్రషర్లను తొలగిస్తున్న దృశ్యం

గౌలిదొడ్డి అక్రమ ఆర్ఎంసి, క్రషర్లను తొలగిస్తున్న దృశ్యం

గౌలిదొడ్డి అక్రమ ఆర్ఎంసి, క్రషర్లను తొలగిస్తున్న దృశ్యం

జలవనరును పూడ్చి ఏర్పాటు చేసిన అక్రమ క్రషర్ నేలమట్టం

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గౌలిదొడ్డి గోపనపల్లి, ప్రాంతాలతో పాటు వట్టినాగులపల్లి, శంషాబాద్‌లోని కొత్వాల్‌గూడలో గత కొన్నేళ్లుగా అక్రమ క్రషర్లు కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు కొనసాగుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్ లోపల క్రషర్లకు అనుమతి లేదంటూ ప్రభుత్వం నిబంధనలు విధించినా కిందిస్థాయి అధికారుల అండదండలతో ఈ ప్రాంతాల్లో క్రషర్లు, మిక్సింగ్ ప్లాంట్లు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. గతంలో ఈ ప్లాంట్లను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు అడ్డుకున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారుల అండదండలతో మిక్సింగ్ ప్లాంట్ల యజమానులు యదేచ్ఛగా ప్రకృతిని ధ్వంసం చేస్తూ ప్లాంట్లను కొనసాగిస్తున్నారు. దీంతో పిసిబి, రెవెన్యూ శాఖలు కొన్ని రోజుల క్రితం హైడ్రాకు ఫిర్యాదు చేశాయి. స్పందించిన హైడ్రా మంగళవారం అనుమతిలేని క్రషింగ్ యూనిట్లపై చర్యలు తీసుకుంది. 8 క్రషింగ్ యూనిట్లతో పాటు.. 13 ఆర్ఎంసీ ప్లాంట్లలో మూడింటిని నేలమట్టం చేసింది. మిగిలిన 10 ఆర్ఎంసీ ప్లాట్లను తొలగించాల్సి ఉంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), మైనింగ్, రెవెన్యూ శాఖల ఫిర్యాదు మేరకు మంగళవారం హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి, గోపన్నపల్లి, శంషాబాద్‌లోని కొత్వాల్‌గూడలో ఏళ్లుగా నడుస్తున్న క్రషింగ్ యూనిట్లను తొలగించింది.

బినామీ పేర్లతో బడాబాబుల దందా...

హైదరాబాద్ ధ్వంసం చేసిన కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు క్రషర్లు బినామీ పేర్లతో బడాబాబులు కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. సదరు ప్లాంట్లు ఎవరివి అని హైడ్రా ఆరా తీస్తే సరైన చిరునామా లేకుండా కొనసాగుతున్నట్లుగా గుర్తించారు. చివరికి ఎన్ని ఎకరాలు లీజుకు తీసుకున్నారు..

ఎన్ని ఎకరాల్లో ప్లాంటు కొనసాగుతుందనే వివరాలు సైతం లేకపోవడం విస్తుగొలుపుతుంది. కొత్వాల్‌గూడలో దాదాపు 16 ఎకరాల మేర విస్తరించిన తిరుమల మెటల్ ఇండస్ట్రీకి చెందిన క్రషింగ్ యూనిట్ 7 ఎకరాల వరకూ ఉన్న కొండల్ని పిండి చేసినట్టు హైడ్రా గుర్తించింది. శేరిలింగంపల్లి పరిధిలోని భగత్‌సింగ్ స్టోన్ క్రషర్, ఎస్‌వీకే, పరమేశ్వర్ స్టోన్, ప్రథ్వి, గ్రేట్ ఇండియా మైనింగ్, ఆర్ మిల్లర్, తిరుమల మెటల్ ఇండస్ట్రీకి చెందిన క్రషింగ్ యూనిట్లతో పాటు బీఎస్ ఆర్, అల్ఫాటెక్, ఏసీసీ రెడీమిక్స్ ప్లాంట్లను సైతం హైడ్రా ధ్వంసం చేసింది. ఇందులో ఏ ఒక్క క్రషింగ్ యూనిట్‌కూ మైనింగ్‌తో పాటు, పీసీబీ అనుమతులు లేకపోవడం గమనించాల్సిన విషయం. పీసీబీ నోటీసులు, రెవెన్యూ శాఖ ఆదేశాలు, మైనింగ్ శాఖ అభ్యంతరాలను పట్టించుకోకుండా నడుస్తున్న ఈ ప్లాంట్లు హైడ్రా చర్యలతో మంగళవారం నేల మట్టమయ్యాయి.

'కాళేశ్వరం'పై బీఆర్ఎస్–బీజేపీ లాలూచీ

'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం రైతు వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాను మంగళవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి పొంగులేటి ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన రైతులనుద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకోవాలనే ఉద్దేశంతోనే బీజేపీ కాళేశ్వరం విషయంలో చర్యలకు వెనకాడుతున్నట్లు ఆరోపించారు. రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్తు కొనుగోళ్లు, విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో అవినీతిపై సీబీఐ ద్వారా సమగ్ర విచారణ చేయించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.మాజీ సీఎం కేసీఆర్ ప్రతినెలా జీతం తీసుకుంటూ ప్రతిపక్ష నాయకుడి బాధ్యతను నిర్వర్తించకుండా మళ్లీ తామే అధికారంలోకి వస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. తడిసిన ధాన్యం విషయంలో ప్రతిపక్షాలు మొసలి కన్నీరు కారుస్తున్నాయని, రైతులు భయపడాల్సిన పనిలేదని, ప్రతి గింజను తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులు, ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మేస్థితిలో లేరన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ నాడు వైఎస్ ఏకకాలంలో రుణమాఫీ చేశారని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల రుణాలు రూ.21 వేల కోట్లు మాఫీ చేశారన్నారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ''బీజేపీ నాయకులు జై శ్రీరాం అంటూ మాట్లాడటం తప్ప తెలంగాణకు చేసిందేమీ లేదు. జై శ్రీరాం అంటే అయిపోతుందా.. పైనుంచి పైసలు పడతాయా.. పథకాలు అమలవుతాయా'' అని అన్నారు. మోదీని తీసుకొచ్చి మీటింగులు పెట్టిస్తారు.. కానీ మన దగ్గర జరిగే పుష్కరాలకు కేంద్రం నుంచి ఒక్క పైసా ఇవ్వరని విమర్శించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని అన్నారు. అన్నదాతలు ఆశీర్వదించిన ప్రభుత్వాలు బాగుపడతాయని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడూ ఆశీర్వదించాలని కోరారు.కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, నగర మేయర్ సుధారాణి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద,

చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు.భూసార పరీక్షలు చేయించుకున్న పలువురు రైతులకు మంత్రులు ప్రశంసా పత్రాలు అందజేశారు.రైతు మేళాలో రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం.. మేలు రకాలైన వంగడాలు, ఆధునిక యంత్రాల సమాచారంతో స్టాళ్లు ఏర్పాటు చేశారు. గుజరాత్, పంజాబ్, హరియాణా, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు చెందిన ఆవులతోపాటు పుంగనూరు ఆవులు, పలు రకాల కోళ్లు ప్రదర్శనకు ఉంచారు.మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాలో వివిధ యంత్ర పరికరాల తయారీ సంస్థలు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచాయి.

ఉద్యానశాఖ పంటల సాగు, అధిక దిగుబడులతో లాభాల సమాచారాన్ని అందిస్తోంది. పలువురు రైతులు దేశీయ రకాల వంగడాలతో పండించిన పంట ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. చేనేత, పశు సంవర్ధక, మత్స్య శాఖల స్టాళ్లలో వివిధ ఉత్పత్తులతోపాటు ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందించే పథకాల సమాచారం అందుబాటులో ఉంచారు.

పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సిలబస్‌లో ఏఐపై కమిటీ: సీఎం రేవంత్

ఈకబురు, హైదరాబాద్:

పాఠశాల నుంచి ఉన్నతవిద్య వరకు సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై కమిటీ వేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కమిటీకి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌ను సీఎం కోరారు. ఏఐని సరైన విధానంలో వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని రఘురాం రాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలపై జరిగిన సమావేశంలో రఘురాం రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని సూచనలు ఇచ్చారు. నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్య తగ్గించుకోవాలని సూచించారు. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వాల సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందన్నారు. తమిళనాడు తరహా పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని రఘురాం రాజన్ సూచించారు. మిడ్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు రఘురాం రాజన్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో సులభతర వ్యాపారానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

రేపే విజయ్ ప్రమాణం?

శాసనసభా పక్ష నేతగా ఎన్నిక

విజేతలైన ఎమ్మెల్యే అభ్యర్థులతో చెన్నై సమీప పనైయూర్‌లోని టీవీకే ప్రధాన కార్యాలయంలో మంగళవారం విజయ్ భేటీ అయ్యారు. అనంతరం తమ శాసనసభాపక్ష నేతగా విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు తమ ఎమ్మెల్యేలను భద్రంగా చూసుకునేందుకు మామల్లపురంలోని ఓ స్టార్ హోటల్‌ను అద్దెకు తీసుకున్నారు.

విజయ్‌కి కాంగ్రెస్ మద్దతు!

విజయ్‌కి మద్దతివ్వడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ తమ సహాయం కోరారని, ప్రజాతీర్పును దృష్టిలో ఉంచుకొని వెంటనే దీనిపై నిర్ణయం తీసుకోవాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీని ఆదేశించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ దిల్లీలో వెల్లడించారు. 234 స్థానాలున్న అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 118 మంది ఎమ్మెల్యేలు అవసరం. టీవీకేకు 108 మందే ఉన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ మద్దతిచ్చినా మరో ఐదుగురిని కూడగట్టాల్సి ఉంటుంది. దీనికోసం ఇతర పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు టీవీకే వర్గాలు తెలిపాయి.

సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా

అధికార డీఎంకే ఓటమి చెందడంతో ముఖ్యమంత్రి పదవికి మంగళవారం ఎం.కె.స్టాలిన్ రాజీనామా చేశారు. ఆ లేఖను గవర్నర్ కార్యాలయానికి పంపించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు సీఎం పదవిలో కొనసాగాలని స్టాలిన్‌ను కోరారు.

ప్రధాని మోదీ, రాహుల్‌కు విజయ్ థ్యాంక్స్

రాష్ట్ర ప్రజలశ్రేయస్సే తమ ఏకైక లక్ష్యమని విజయ్ తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రగతి, తమిళనాడు ప్రజల సంక్షేమంపై దృష్టి సారిస్తామన్నారు. కేంద్రం సహకరించాలని ప్రధానిని కోరారు. తమ పార్టీ విజయాన్ని అభినందించిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ పోస్టులు పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు.

ఖతార్ గగనతలంలో అమెరికా 'గ్యాస్ స్టేషన్' మిస్సింగ్..!

ఈకబురు: పశ్చిమాసియా ఘర్షణల వేళ అమెరికాకు మరో ఎదురుదెబ్బ తగిలినట్లు కనిపిస్తోంది. ఆ దేశ మిలిటరీ విమానాలకు ఎగిరే గ్యాస్ స్టేషన్‌గా పనిచేసే బోయింగ్ KC135 స్ట్రాటోట్యాంకర్ ఖతార్ గగనతలంలో రాడార్‌తో సంబంధాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అల్ దఫ్రా ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన ఈ ట్యాంకర్ పర్షియన్ గల్ఫ్ మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు ఎమర్జెన్సీ సిగ్నల్ పంపినట్లు ఇరాన్ మీడియా సంస్థ పేర్కొంది. అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చినప్పుడే అలాంటి కోడ్‌ను ప్రసారం చేస్తారని పేర్కొంది.

పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో అక్కడ మోహరించిన విమానాలకు అవసరమైన ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ఈ ట్యాంకర్‌ను అమెరికా సైన్యం ఉపయోగిస్తోంది. దీనివల్ల ఫైటర్ జెట్స్, బాంబర్లు, ఇతర సైనిక విమానాలు ఎక్కువ గంటలు ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. తాజాగా ఈ విమానం అత్యవసర ల్యాండింగ్‌కు యత్నిస్తోన్న సమయంలో కొద్దిసేపు గుండ్రంగా తిరిగినట్లు ఫ్లైట్‌రాడార్24 డేటాలో కనిపించింది. అయితే అది ఎందుకు అత్యవసరంగా ల్యాండ్ కావాల్సి వచ్చిందో మాత్రం తెలియరాలేదు. అలాగే ఇరాన్‌అమెరికా ఉద్రికత్తలకు దీనికి ఏమైనా సంబంధం ఉందా..? అనేది కూడా స్పష్టత లేదు. తమ ప్రమేయంపై ఇరాన్ ఎలాంటి ప్రకటనా చేయలేదు.

రాజీనామా చేయను



ఈకబురు,,అసెంబ్లీల ఎన్నికల ఫలితాల అనంతరం.. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా.. ఆయా రాష్ట్రాల్లోని ముఖ్య మంత్రులు తమ పదవికి రాజీనామా చేస్తుంటే.. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ భిన్నమైన పంథా ఎంచుకున్నారు. ఎన్నికల్లో పార్టీ ఓడినా, స్వయంగా పరాజయం పాలైనా రాజీనామా చేయబోనని ఆమె సంచలన ప్రకటన చేశారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర జరిగిందని, ఇది ప్రజలిచ్చిన అసలైన తీర్పు కాదని, తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. భాజపాకు వ్యతిరేకంగా కాకుండా ఆ పార్టీ తరఫున పని చేసిన ఎన్నికల సంఘంపై తృణమూల్ పోటీ చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం మంగళవారం కోల్‌కతాలో ఆమె మీడియాతో మాట్లాడారు. ''నేను రాజీనామా చేయాలన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఎందుకంటే మేం ప్రజా తీర్పుతో ఓడిపోలేదు. కుట్రల ఫలితంగా ఓటమి పాలయ్యాం. నేను ఓడిపోలేదు. నేను లోక్ భవన్‌కు (గవర్నర్ వద్దకు) వెళ్లను. రాజ్యాంగపరంగా వారేమైనా చర్యలు తీసుకోవాలనుకుంటే తీసుకోనీయండి. ఈ ఎన్నికల్లో అనేక అక్రమాలు జరిగాయి. కనీసం 100 సీట్లను లూటీ చేశారు. చరిత్రలో ఇది చీకటి అధ్యాయంగా మిగిలిపోనుంది. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అణగదొక్కారు. కేంద్ర సంస్థలు, అధికార వ్యవస్థలు కుమ్మక్కై పని చేశాయి. సోదాలు, బదిలీలు, పక్షపాతం పోటీ వాతావరణాన్ని దెబ్బతీశాయి. ఇంకా నిష్పాక్షికత ఎక్కడుంటుంది. ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో నన్ను నెట్టేశారు. తోసేసి కొట్టారు. కేంద్ర బలగాలకు చెందిన జవాన్లు గూండాల్లా వ్యవహరించారు'' అని మమత ఆరోపించారు.

''నేను కుర్చీలో ఉన్నంత కాలం ఎన్నో అంశాల్లో వేధింపులను సహించా. నేనిప్పుడు స్వేచ్ఛా జీవిని. సామాన్యురాలిని. వీధి పోరాటయోధురాలిని. మళ్లీ వీధుల్లోకి వచ్చి అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడతా'' అని మమత వివరించారు. ఫలితాల అనంతరం చోటుచేసుకున్న హింసపై క్షేత్ర స్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు 10 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మమత ప్రకటించారు.

ఇండియా కూటమి నేతలు పలువురు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారని మమత వెల్లడించారు. సోనియా, రాహుల్ గాంధీ, కేజ్రీవాల్, ఉద్ధవ్ ఠాక్రే, అఖిలేశ్ యాదవ్, హేమంత్ సోరెన్‌లు తనతో మాట్లాడారని తెలిపారు. ఇక నుంచీ తాను జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమిని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

రాజ్యాంగం ఏం చెబుతోంది?

ఓడిపోయినా రాజీనామా చేయబోనని మమత భీష్మించిన నేపథ్యంలో తదుపరి జరగబోయే పరిణామాలపై ఆసక్తి నెలకొంది. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి ఎదురు కాలేదు. ఎన్నికల తర్వాత చేపట్టాల్సిన చర్యల క్రమంపై రాజ్యాంగంలో వివరంగా లేదు. రాజ్యాంగంలోని 164(1) ఆర్టికల్ ప్రకారం.. గవర్నర్‌కు విశ్వాసం ఉన్నంతకాలమే మంత్రులు తమ పదవుల్లో ఉంటారు. అధికారంలో ఉన్న పార్టీ ఎన్నికల్లో మెజారిటీ సాధించలేకపోతే సాధారణంగా ముఖ్యమంత్రి రాజీనామా చేస్తుంటారు. తమిళనాడు, కేరళల్లో అదే జరిగింది. ఓడిపోయిన ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, విజయన్ వెంటనే రాజీనామా చేశారు. సీఎం రాజీనామా చేయకపోతే గవర్నర్ జోక్యం చేసుకోవచ్చు. అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు. ఎలాగూ ఓడిపోయిన పార్టీకి మెజారిటీ ఉండదు కాబట్టి ప్రభుత్వం పడిపోతుంది. మమత రాజీనామా చేయడానికి నిరాకరిస్తే అసెంబ్లీలో బలాబలాలను గవర్నర్ పరిగణనలోకి తీసుకుంటారు. ఆమెకు బలముందో లేదో చూస్తారు. మెజారిటీ లేకపోతే ఆర్టికల్ 164(1) ప్రకారం.. మంత్రివర్గాన్ని భర్తరఫ్ చేస్తారు. కొత్త ప్రభుత్వానికి అవకాశమిస్తారు.

తీర్పులను చోరీ చేసిన భాజపా: రాహుల్

దిల్లీ: ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడంలో భాగంగా పశ్చిమ బెంగాల్, అస్సాంలలో ప్రజా తీర్పులను భాజపా చోరీ చేసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మమత ఓటమిని చూసి సంబరపడుతున్న తమ పార్టీతోపాటు ఇతర పార్టీల్లోని వారు ఇకనైనా చిల్లర రాజకీయాలను పక్కన పెట్టాలని, ఇది ఏ ఒక్క పార్టీకో కాకుండా దేశానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. తృణమూల్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ మంగళవారం ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

రాజ్యాంగ ఉల్లంఘనే: భాజపా

ఓడిపోయినా రాజీనామా చేయబోనని మమత భీష్మించడం శాంతియుత అధికార మార్పిడి భావనను దెబ్బతీస్తుందని భాజపా అధికార ప్రతినిధి షెజాద్ పూనావాలా వ్యాఖ్యానించారు. హింస ద్వారా రాజ్యాంగ వ్యవస్థలను స్తంభింపజేయాలనుకునే మమత ధోరణి.. అమెరికాలో క్యాపిటల్ హిల్‌పై జరిగిన దాడిని గుర్తు చేస్తోందని అభిప్రాయపడ్డారు.

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే

ఈకబురు, హైదరాబాద్ ;
తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం నడుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అక్రమాలపై గళమెత్తిన బీజేపీ నేతలు ఇప్పుడు సీబీఐ దర్యాప్తు విషయంలో తాత్సారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికల ముందు విచారణ కోరిన వారే నేడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర సంస్థల ద్వారా విచారణ జరిపించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ తెలంగాణ పర్యటనకు వచ్చేలోపు బీఆర్ఎస్ నేతల అక్రమాలపై సీబీఐ దర్యాప్తు ప్రారంభిస్తారో లేదో కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గత ఎన్నికల గణాంకాలను విశ్లేషిస్తూ సిరిసిల్ల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీకి కేవలం 18 వేల ఓట్లు మాత్రమే వచ్చాయని గుర్తు చేశారు. అయితే లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ ఓట్ల సంఖ్య ఏకంగా 72 వేలకు ఎలా పెరిగిందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకత్వం మద్దతు లేకుండానే బీజేపీకి ఇన్ని ఓట్లు రావడం వెనుక ఉన్న రహస్యం ఏంటని నిలదీశారు. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో బీఆర్ఎస్ పార్టీకి తమకు అసలు పొంతనే లేదని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 'వరి వేస్తే ఉరే' అంటూ రైతులను భయభ్రాంతులకు గురిచేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ముమ్మరంగా ధాన్యం సేకరిస్తోందని వెల్లడించారు. సన్న బియ్యం పండించే రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్న ఏకైక ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కొనియాడారు. పేదలకు నాణ్యమైన బియ్యం ఇస్తూనే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న ప్రభుత్వం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని నిరూపించేందుకు ఇప్పటికే రూ. 2,500 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధిని అడ్డుకుంటూ రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు.

ఏరోస్పేస్ దిగ్గజాలకు వ్యూహాత్మక భాగస్వామిగా తెలంగాణ

ఈకబురు,మహేశ్వరం, : అంతర్జాతీయ ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణను వ్యూహాత్మక భాగస్వామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లాంటి నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతల్లోనూ రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం హార్డ్‌వేర్ పార్క్ ఫేజ్3లో రూ.453 కోట్లతో, 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న 'ఐటీపీ ఏరోఇండియా' ఉత్పత్తి కేంద్రానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ''అనతికాలంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌లలో ఒకటిగా తెలంగాణను నిలిపా□. వరుసగా ఐదేళ్లు కేంద్రం నుంచి 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకున్నాం. స్పెయిన్ దిగ్గజ సంస్థ 'ఐటీపీ ఏరో' సంస్థ... విమాన ఇంజిన్ల తయారీలో వినియోగించే అత్యంత కీలక విడిభాగాలను ఇక్కడ ఉత్పత్తి చేస్తుంది. ప్రాథమికంగా 350 మంది హై స్కిల్డ్ నిపుణులకు ఉపాధి లభిస్తుంది. మున్ముందు ఈ సంఖ్య 600కు పెరుగుతుంది'' అని వివరించారు. కార్యక్రమంలో ఐటీపీ ఏరో గ్రూప్ సీఈవో ఈవా అజూలే, ఎండీ కార్లోస్ అల్జోలా, వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) వాలెంటిన్ గొరోనో, ఐటీపీ ఇండియా ఎండీ సందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు. రెండు జీసీసీలు ఏర్పాటు చేయనున్న బీఏఎస్ఎఫ్ రసాయనాల తయారీలో ప్రపంచంలోని అతి పెద్ద సంస్థల్లో ఒకటైన జర్మన్ దిగ్గజం 'బీఏఎస్ఎఫ్' సంస్థ.. హైదరాబాద్‌లో రెండు జీసీసీలను ఏర్పాటు చేయనుంది. గ్లోబల్ డిజిటల్ హబ్, గ్లోబల్ సర్వీసెస్ హబ్ పేరిట నెలకొల్పే ఈ జీసీసీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి అంగీకార పత్రం (లెటర్ ఆఫ్ ఇంటెంట్ ఎల్ఓఐ) సమర్పించింది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ సమక్షంలో... హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బీఏఎస్ఎఫ్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్.. తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ సర్వేశ్‌సింగ్‌కు ఎల్ఓఐని అందజేశారు. వీటి ఏర్పాటుతో 3వేల మంది నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయని పరిశ్రమల శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... ''తెలంగాణలో ఈ ఏడాది 100 జీసీసీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. వీటి ద్వారా లక్ష మంది ఐటీ నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. 160 ఏళ్ల చరిత్ర కలిగిన బీఏఎస్ఎఫ్ ప్రపంచ వ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 234 కర్మాగారాలు, 1,08,000 మంది ఉద్యోగులతో పనిచేస్తున్న ఈ సంస్థ వార్షిక ఆదాయం రూ.5 లక్షల కోట్లకు పైనే'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఏఎస్ఎఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలెగ్జాండర్ గెర్డింగ్, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్..

పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే పులిట్జర్ పురస్కారం ఇద్దరు భారతీయ జర్నలిస్టులను వరించింది (Pulitzer Prize). డిజిటల్ నిఘా, సైబర్ మోసాలను విస్తృతంగా వెలుగులోకి తెచ్చినందుకు ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మ ఈ అవార్డును దక్కించుకున్నారు. ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్, కామెంటరీ విభాగం కింద దీనిని ప్రకటించారు. ప్రముఖ మీడియా సంస్థ బ్లూమ్‌బెర్గ్‌కు చెందిన నటాలీ ఒబికో పియర్సన్‌తో కలిసి ఆనంద్, సుపర్ణ ఈ అవార్డును షేర్ చేసుకోనున్నారు.

మే 9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం

ఈకబురు, : పశ్చిమబెంగాల్‌లో మే 9న భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ రోజున నూతన సీఎం ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. ఠాగూర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఒక కొత్త ఆరంభానికి నాంది పలకడానికి ఈ తేదీని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన పనులు చేస్తున్నామన్నారు. కాగా బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. బెంగాల్ ఎన్నికల ఫలితాల అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ ఉన్నతాధికారులు.. ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్‌కు నేడు అందజేయనున్నారు. బుధవారం ఈ అధికారిక పత్రాలను సీఈసీ.. గవర్నర్ ఆర్.ఎన్.రవికి ఇస్తారు. అనంతరం కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా రాజ్యాంగప్రక్రియ కొనసాగుతుంది.

ఏళ్ల తర్వాత తెరుచుకున్న ఆలయం..

బెంగాల్‌లోని అసన్‌సోల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మూసిఉన్న దుర్గాదేవి ఆలయం సోమవారం తిరిగి తెరుచుకుంది. వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, పాలనాపరమైన ఆంక్షల వల్ల ఈ ఆలయం చాలా కాలంగా మూసేసి ఉంది. దుర్గా పూజ, లక్ష్మీ పూజ వంటి వేడుకల కోసం మాత్రమే దీనిని తెరిచేవారు. తాను గెలిస్తే ఆలయాన్ని తెరిపిస్తానని అసన్‌సోల్ ఉత్తర్ స్థానం నుంచి పోటీ చేసిన భాజపా ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ ప్రజలకు వాగ్దానం చేశారు. చెప్పినట్లుగానే సోమవారం గెలిచిన వెంటనే ఆయన ఆలయాన్ని సందర్శించి పునఃప్రారంభించారు.

గో బ్యాక్ మోదీ అంటూ..
ప్రధాని పర్యటన పై కాంగ్రెస్ నిప్పులు

దేశ ప్రధాని రాష్ట్ర పర్యటనకు వస్తున్న తరుణంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత కొంతకాలంగా బీజేపీకి ధీటుగా బదులిస్తున్న కాంగ్రెస్ పార్టీ, తాజాగా ప్రధాని పర్యటనను అడ్డుకోవడమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలకు పదును పెట్టింది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లు, నిధుల కేటాయింపు అంశాలను తెరపైకి తెచ్చి కమలనాథులను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. ప్రధాని రాకను నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తుతున్నారు. గత ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా మూడు కీలక అంశాలపై హస్తం నేతలు క్లారిటీ డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర నిధులపై శ్వేతపత్రం..

స్థానిక సంస్థల్లో చట్టసభల్లో బీసీలకు ఇవ్వాల్సిన రిజర్వేషన్ల విషయంలో కేంద్రం వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతే గాక విభజన హామీల అమల్లో జాప్యం, జీఎస్టీ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని పట్టుబడుతున్నారు. మరో వైపు దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలన్న డిమాండ్‌ను ప్రధాని ఎందుకు విస్మరిస్తున్నారో సమాధానం చెప్పిన తర్వాతే పర్యటించాలని కాంగ్రెస్ నేతలు హెచ్చరిస్తున్నారు.

బీజేపీని డ్యామేజ్ చేసే వ్యూహం..

రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు బ్రేకులు వేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ఈ దాడులను తీవ్రతరం చేసింది. క్షేత్రస్థాయిలో బీసీ సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేందుకు, బీజేపీని 'బీసీ వ్యతిరేక పార్టీ'గా చిత్రించేందుకు సోషల్ మీడియా వేదికగా క్యాంపెయిన్ మొదలుపెట్టింది. "బీసీలకు న్యాయం చేయని ప్రధానికి మా గడ్డపై అడుగుపెట్టే హక్కు లేదు. నిధులు ఇవ్వకుండా, హక్కులు కల్పించకుండా కేవలం ఓట్ల కోసమే ఈ పర్యటనలు చేస్తున్నారు." అని కాంగ్రెస్ ముఖ్య నేతలు విమర్శిస్తున్నారు.

పర్యటన ప్రభావం ఎలా ఉంటుంది?

ఒకవైపు బీజేపీ పర్యటనను భారీ విజయవంతం చేయాలని చూస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ ఆ పర్యటన ఉద్దేశాన్ని నీరుగార్చేందుకు గట్టిగా ప్రయత్నిస్తోంది. "గో బ్యాక్ మోదీ" నినాదాలతో క్షేత్రస్థాయిలో నిరసనలు తెలిపేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ప్రధాని పర్యటనకు మరో ఐదు రోజుల సమయం గడువు ఉండగానే కాంగ్రెస్ నేతలంతా వరుసగా మోడీపై పొలిటికల్ ఎటాక్ దిగడం గమనార్హం. అయితే ఈ పొలిటికల్ వార్ రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

జైశ్రీరామ్ అంటే.. పైనుంచి పైసలు పడుతున్నాయా?

తెలంగాణ రాజకీయాల్లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ప్రధాని మోడీ పర్యటనను పురస్కరించుకుని ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. ముఖ్యంగా హిందూ నినాదమైన 'జై శ్రీరామ్' అంశంపై ఆమె స్పందించిన తీరు పట్ల బీజేపీ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నాయి. ఒక బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి దైవ చింతనను అవమానించడం సరికాదని కమలం పార్టీ నేతలు ధ్వజమెత్తుతున్నారు.

హాట్ టాపిక్ గా మంత్రి వ్యాఖ్యలు..

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బీజేపీ నాయకులు కేవలం నినాదాలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. 'జై శ్రీరామ్' అంటే పైసలు రాలుతాయా లేక పథకాలు వస్తాయా అంటూ ఆమె ప్రశ్నించారు. ప్రధాని పర్యటన వేళ కేవలం భావోద్వేగాలను రెచ్చగొట్టడం మినహా బీజేపీ వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఆమె ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హిందూ సంఘాలు రాజకీయ పార్టీల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

బీజేపీ ఫైర్

మంత్రి వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధికారికంగా స్పందించింది. ఆమె దేవాదాయ శాఖ మంత్రి కాదు దైవద్రోహ శాఖ మంత్రి అంటూ ఎక్స్ వేదికగా ఘాటు విమర్శలు చేసింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ నాయకులు హిందువుల మనోభావాలను గాయపరుస్తున్నారని మండిపడింది. శ్రీరాముడిని అపహాస్యం చేయడం అంటే హిందూ సమాజాన్ని అవమానించడమేనని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవుళ్లను కించపరిచేలా మాట్లాడే వారికి మంత్రిగా కొనసాగే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు.

క్షమాపణలకు బీజేపీ డిమాండ్..

మంత్రి కొండా సురేఖ తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేస్తోంది. హిందూ సమాజానికి ఆమె బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పట్టుబడుతోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బాధ్యత గల వ్యక్తులు మాట్లాడటం గమనార్హం. దేవాదాయ శాఖ బాధ్యతలు నిర్వహిస్తూ భక్తిని తక్కువ చేసి మాట్లాడటం ఆమె అజ్ఞానానికి నిదర్శనమని విమర్శకులు పేర్కొంటున్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ వివాదం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ విమర్శలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొడుతున్నాయి. మంత్రి వ్యాఖ్యల ఉద్దేశం దేవుడిని అవమానించడం కాదని కేవలం బీజేపీ రాజకీయాలను ఎండగట్టడమేనని సమర్థించుకుంటున్నారు. అభివృద్ధిని విస్మరించి కేవలం భక్తి పేరుతో రాజకీయాలు చేయడంపైనే ఆమె స్పందించారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అయితే హిందూ మనోభావాలకు సంబంధించిన విషయం కావడంతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. రాజకీయ లబ్ధి కోసం దేవుడి పేరును వాడుకోవడంపై జరుగుతున్న ఈ చర్చ ఎటు దారితీస్తుందో వేచి చూడాలి.

ఎఫ్‌డీఐలపై 12 వారాల్లో నిర్ణయం

దిల్లీ: ప్రభుత్వం ఇక నుంచి అన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనలను 12 వారాల్లో పరిష్కరించనుంది. ఆ మేరకు ప్రామాణీకరించిన నిర్వహణ ప్రక్రియ (ఎస్ఓపీ)ను అప్‌డేట్ చేసింది. ఎస్ఓపీ ప్రకారం.. ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోవడానికి 12 వారాల సమయాన్ని నిర్ణయించారు. ఇందులో దరఖాస్తుదారులు తమ ప్రతిపాదనల్లోని లోపాలను తొలగించడం లేదా అదనపు సమాచారాన్ని సంబంధిత అధికారులకు సమర్పించడానికి పట్టే సమయం లెక్కలోకి రాదు. 2017 నాటి ఎస్ఓపీ ప్రకారం.. ఒక ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవడానికి గరిష్ఠ సమయం 10 వారాలుగా ఉంది. ప్రస్తుత ఎస్ఓపీ కింద అదనంగా ఇచ్చిన 2 వారాల సమయంలో పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం(డీపీఐఐటీ) ఈ ప్రతిపాదనలను తిరస్కరించాలా లేదా అదనపు షరతులను సంబంధిత అథారిటీ విధించాల్సి ఉందా అన్న విషయాన్ని పరిశీలిస్తుంది. కొత్త ఎస్ఓపీ కింద ఎఫ్‌డీఐ దరఖాస్తు ఫైలింగ్ అంతా కాగిత రహితంగానే ఉంటుంది.

ఈ దేశాల ఎఫ్‌డీఐలు ఇలా..

భారత్‌తో భూసరిహద్దులు పంచుకునే దేశాలకు సంబంధించిన అన్ని దరఖాస్తులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతికి పంపుతారు. అవసరమైతే ఇతర దరఖాస్తులనూ పంపుతారు. ఆర్‌బీఐ, హోం శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ సహా అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఏ ప్రతిపాదనపైన అయినా సంప్రదిస్తారు. నిర్దేశిత సమయంలో ఆయా విభాగాలు/శాఖలు తమ వ్యాఖ్యలను పంపాల్సి ఉంటుంది. సమయంలోగా స్పందనేదీ రాకపోతే, ఎటువంటి వ్యాఖ్యలూ లేవని భావిస్తారు.

40 ఉప రంగాల గుర్తింపు

మనతో భూసరిహద్దులు పంచుకునే దేశాల ఎఫ్‌డీఐ ప్రతిపాదనలపై వేగవంతమైన అనుమతులకు 6 రంగాల్లోని 40 ఉప రంగాలను కేంద్రం గుర్తించింది. ఇందులో యంత్రపరికరాల తయారీ; ఎలక్ట్రానిక్ యంత్ర పరికరాలుఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ; పాలీసిలికాన్, ఇన్‌గాట్ వేఫర్లు; అధునాతన బ్యాటరీ విడిభాగాలు; అరుదైన భూఅయస్కాంతాలు, అరుదైన భూ అయస్కాంత ప్రాసెసింగ్.. రంగాల్లో ఉప రంగాలనూ గుర్తించింది. అందులో ఇన్సులేషన్ వస్తువుల తయారీ, థర్మల్/హైడ్రో/అణు ఇంధన ప్లాంట్లలో క్యాస్టింగ్, ఫోర్జింగ్; మెషీన్ టూల్స్; డిస్‌ప్లే విడిభాగాలు; కెమెరా మాడ్యూళ్లు; ఎలక్ట్రానిక్ కెపాసిటర్లు, ఐసీటీ ఉత్పత్తులకు స్పీకర్లుమైక్రోఫోన్లు; లిథియం అయాన్ బ్యాటరీలు; వేరబుల్స్; రేర్ ఎర్త్ మెటల్, అలాయ్‌మ్యాగ్నెట్ తయారీ తదితరాలున్నాయి.

మహీంద్రా అండ్ మహీంద్రా లాభం రూ.5,260 కోట్లు

వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా, మార్చి త్రైమాసికంలో రూ.5,259.91 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,541.85 కోట్లతో పోలిస్తే ఇది 48.5% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.42,585.67 కోట్ల నుంచి రూ.54,891.55 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.39,113.61 కోట్ల నుంచి రూ.49,615.48 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరం (2025-26)లో కంపెనీ లాభం రూ.18,621.71 కోట్లుగా నమోదైంది. 2024-25 లాభం రూ.14,073.17 కోట్ల కంటే ఇది 32.32% అధికం. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,58,749.75 కోట్ల నుంచి రూ.1,97,792.78 కోట్లకు చేరింది. రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.33 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

విభాగాల వారీగా: మార్చి త్రైమాసికంలో వాహన విక్రయాలు 21% పెరిగి 3.07 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. 2025-26లో ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ట్రాక్టర్ల విభాగంలో కంపెనీ మార్కెట్ వాటా 43.6 శాతానికి పెరిగింది. 2025-26లో 5 లక్షలకు పైగా ట్రాక్టర్ల బిల్లింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించింది.

భవిష్యత్తు అంచనాలు, ప్రణాళికలు: 2031 నాటికి 10 కొత్త ఐసీఈ ఎస్‌యూవీలు, 6 కొత్త విద్యుత్తు వాహనాలను తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఏడాదిలో ట్రాక్టర్ పరిశ్రమ స్వల్ప వృద్ధి నమోదు చేయొచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచడం ద్వారా అన్ని వ్యాపార విభాగాలను ఆధునికీకరించాలని కంపెనీ యోచిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఎం అండ్ ఎం షేరు 3.41% లాభంతో రూ.3,211.65 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,168.98 కోట్లు పెరిగి రూ.3.99 లక్షల కోట్లకు చేరింది.

ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచుతున్న రిలయన్స్

ఆల్కలైట్స్ ఎగుమతుల్లో కోత

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, ఏర్పడిన సరఫరా అంతరాయాల వల్ల మనదేశంలో వంట గ్యాస్ (ఎల్‌పీజీ)కు కొరత ఏర్పడుతోంది. అందుకే ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచడంపై దృష్టి సారించిన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇందుకోసం ఆల్కలైట్స్ ఉత్పత్తిని తగ్గించుకుంటోంది. గ్యాసోలైన్‌లో మిశ్రమంగా ఆల్కలైట్‌స్‌ను వాడతారు. రిలయన్స్ తన రిఫైనింగ్ కాంప్లెక్స్‌లో ఆల్కిలేషన్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. ఇందులో ఉత్పత్తి చేసిన ఆల్కలైట్‌స్‌ను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచేందుకు ఆల్కలైట్స్ ఎగుమతులను రిలయన్స్ ఇండస్ట్రీస్ తగ్గించుకుంటోంది. పశ్చిమాసియా యుద్ధానికి ముందున్న పరిస్థితులతో పోలిస్తే, ఎల్‌పీజీ ఉత్పత్తి మూడింతలకు పైగా పెరిగినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ చెబుతోంది. దీంతో పశ్చిమాసియా దేశాల నుంచి తగ్గిన ఎల్‌పీజీ దిగుమతుల్లో కొంత మేర భర్తీ చేయగలిగామని కంపెనీ పేర్కొన్నట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది.

నిర్వహణ కోసం క్రూడ్ యూనిట్ మూసివేత

రోజుకు 6.60 లక్షల బ్యారెళ్ల ముడిచమురును శుద్ధి చేయగలిగిన తన రిఫైనరీ కాంప్లెక్స్‌లో ఉన్న క్రూడ్ యూనిట్, మరికొన్ని అనుబంధ యూనిట్లను వార్షిక నిర్వహణ పనుల కోసం కొంతకాలం మూసివేసే యోచనలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెల మధ్య నుంచి 34 వారాల పాటు ఈ యూనిట్లలో కార్యకలాపాలు ఆపేయనుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే దేశంలో ఇంధన కొరత సమస్య తలెత్తకుండా, నయారా ఎనర్జీ రిఫైనరీ కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యాక ఈ యూనిట్లలో కార్యకలాపాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ నిలిపివేస్తుందని వెల్లడించాయి.

సైనికుల కోసం నయా అవతార్‌లో థార్ రాక్స్ ..

పోస్ట్ చేసిన ఆనంద్ మహీంద్రా

మహీంద్రా థార్.. దేశీయ మార్కెట్‌లో దీనికున్నక్రేజే వేరు. ముఖ్యంగా ఆఫ్ రోడ్ వాహనాలు ఇష్టపడే వారికి థార్ నడపడం ఒక ఎమోషన్. రోడ్డుపై వెళుతుంటే దాని లుక్ చూపరులనూ కట్టిపడేస్తుంది. ఇప్పుడీ థార్ రాక్స్ మరింత రగ్గడ్ లుక్‌తో సరికొత్త అవతార్‌లో రాబోతోంది. మహీంద్రా ఏటీవీ (ఆల్ టెరియన్ వెహికల్) పేరుతో దేశీయ సైనిక అవసరాల కోసం దీన్ని ప్రత్యేకంగా రూపొందించారు. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ఈ వాహనాన్ని పరిచయం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు.

బెంగళూరుకు చెందిన ప్రద్ 4×4 అనే సంస్థతో కలిసి మహీంద్రా దీన్ని రూపొందించింది. సాధారణ కారులా అనవసరమైన అలంకరణలు ఏవీ లేకుండా దీన్ని రూపొందించినట్లు ఆనంద్ మహీంద్రా చెప్పారు. సైనిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనితీరు, సామర్థ్యంపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. మెటల్ బాడీతో రూపొందిన ఈ వాహనం.. ఎయిర్‌డ్రాప్‌ను సైతం తట్టుకోగలదని తెలిపారు. ఎలాంటి కఠిన వాతావరణ పరిస్థితుల్లోనైనా ప్రయాణించగలదని పేర్కొన్నారు. ఈ మేరకు మహీంద్రా ఏటీవీ చిత్రాలను ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. మహీంద్రా ఏటీవీ విషయానికొస్తే.. థార్ రాక్స్ డీజిల్ వెర్షన్ ఆధారంగా ఇది రూపొందింది. ఇందులో 2.2 లీటర్ ఇంజిన్ ఉంది. ఇది 172 హెచ్‌పీ శక్తిని, 400 Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆయుధాలను అమర్చుకోవడానికి వీలుగా గన్ మౌంట్ ఉంది. యుద్ధ సమయాల్లో విమానాల నుంచి పారాచూట్ సాయంతో నేరుగా కిందకు వదిలినా తట్టుకోగలిగేలా దీన్ని రూపొందించారు. వాహనం కింది భాగం దెబ్బతినకుండా అండర్ బాడీ ప్రొటెక్షన్ ఇచ్చారు. విండ్‌షీల్డ్ ప్రొటెక్టర్ కూడా ఉంది. వెనుక భాగంలో అదనపు టైర్లు, ఇంధనం/నీరు పెట్టుకునే సదుపాయం ఉంది. అతి ఎక్కువ గ్రౌండ్ క్లియరెన్స్‌తో వస్తోంది.

ఏప్రిల్‌లో 26,11,317 వాహనాల విక్రయాలు: ఫాడా

ఏప్రిల్‌లో దేశీయంగా వాహన రిటెయిల్ విక్రయాలు 26,11,317గా నమోదయ్యాయి. 2025 ఇదే నెలలో విక్రయమైన 23,12,221 వాహనాల కంటే ఇవి 12.94% అధికమని డీలర్ల సంఘం ఫాడా తెలిపింది. ఆర్‌బీఐ సానుకూల వడ్డీ రేట్లు, జీఎస్‌టీ 2.0 ప్రయోజనాలు, పెళ్లిళ్ల సీజన్, గ్రామీణ డిమాండ్ ఇందుకు తోడ్పడ్డాయని వెల్లడించింది. ప్రయాణికుల వాహన (పీవీ) అమ్మకాలు 3,63,028 నుంచి 12.21% పెరిగి 4,07,355 కు చేరాయి. ద్విచక్రవాహన విక్రయాలు 13.01% వృద్ధితో 19,16,258 యూనిట్లుగా నమోదయ్యాయి. వాణిజ్య వాహన (సీవీ) అమ్మకాలు 15.02% పెరిగి 99,339 యూనిట్లకు చేరాయి. త్రిచక్రవాహన విక్రయాలు 7.19% వృద్ధితో 1,06,908గా ఉన్నాయి. మొత్తం 6 వాహన విభాగాల్లో 5, గత నెలలో జీవనకాల గరిష్ఠాలను నమోదు చేశాయని ఫాడా ఉపాధ్యక్షుడు సాయి గిరిధర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ బలంగా ఉంది. ముఖ్యంగా పీవీ విభాగంలో గ్రామీణ అమ్మకాలు 20.40% పెరగ్గా, పట్టణ వృద్ధి 7.11% శాతంగా ఉంది. రాబోయే మూడు నెలలపై పరిశ్రమ ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా వడగాల్పుల హెచ్చరికలు, పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల పెరిగే ఇంధన ధరలు, వాణిజ్య వాహన విభాగంలో నగదు లభ్యత వంటి అంశాలను గమనించాల్సి ఉంటుందని గిరిధర్ స్పష్టం చేశారు.

హర్మూజ్ ఉద్రిక్తతలు పడేశాయ్

హర్మూజ్ జలసంధిలో తాజాగా పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో, మంగళవారం మన స్టాక్ మార్కెట్‌లో విక్రయాల ఒత్తిడి కనిపించింది. రూపాయి విలువ రికార్డు కనిష్ఠానికి పడిపోయి, ముడి చమురు ధరలు బెంబేలెత్తిస్తుండటంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 110 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 5 పైసలు లాభపడి 95.18 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా సూచీలు పని చేయలేదు. హాంకాంగ్ సూచీ డీలా పడింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.43,000 కోట్లు తగ్గి, రూ.466.81 లక్షల కోట్ల (4.90 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,103.72 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,269.40 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,515.03 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 77,151.33 పాయింట్ల వద్ద గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 251.61 పాయింట్ల నష్టంతో 77,017.79 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 86.50 పాయింట్లు కోల్పోయి 24,032.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,081.7023,882.05 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 18 నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 1.53%, ఎటర్నల్ 1.37%, టెక్ మహీంద్రా 1.30%, యాక్సిస్ బ్యాంక్ 1.20%, మారుతీ సుజుకీ 1.15%, భారతీ ఎయిర్‌టెల్ 1.08%, ఎల్ అండ్ టీ 1.07% చొప్పున పడ్డాయి. ఎం అండ్ ఎం 3.41%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.79%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.32%, బజాజ్ ఫైనాన్స్ 0.87%, హెచ్‌యూఎల్ 0.84%, ఇన్ఫోసిస్ 0.80% మేర లాభపడ్డాయి. రంగాల వారీగా స్థిరాస్తి, టాప్ 10 బ్యాంక్స్, సేవలు, మన్నికైన వినిమయ వస్తువులు, ప్రైవేటు బ్యాంకులు, బ్యాంకెక్స్ సూచీలు తగ్గాయి. విద్యుత్, ఎఫ్ఎంసీజీ, కమొడిటీస్, ఆరోగ్య సంరక్షణ, ఐటీ, టెలికాం, యుటిలిటీస్, వాహన, భారీ యంత్ర పరికరాలు, ఫోకస్డ్ ఐటీ సూచీలు పెరిగాయి. బీఎస్ఈలో 1,882 షేర్లు సానుకూలంగా, 2,293 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 180 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

సూపర్ హీరోతో కరీనా?

'క్యోం కీ', 'మై ఔర్ మిసెస్ ఖన్నా', 'బజరంగీ భాయ్‌జాన్' లాంటి విజయవంతమైన చిత్రాలతో హిట్ జోడీ అనిపించుకున్నారు బాలీవుడ్ అగ్రహీరో సల్మాన్ ఖాన్, కథా నాయిక కరీనా కపూర్. ఇప్పుడీ కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతున్నట్లు తెలుస్తోంది. రాజ్ అండ్ డీకే రూపొందిస్తున్న ఓ చిత్రంలో సల్మాన్ సూపర్ హీరోగా నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రంలో నాయికగా కరీనాను ఎంపిక చేసిందట చిత్రబృందం. ''ఇందులోని పాత్ర కోసం కరీనాను స్వయంగా సంప్రదించారు సల్మాన్. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో నటించడానికి కరీనా చాలా ఉత్సాహంగా ఉంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంద''ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

లక్ష్యం సంక్రాంతే!

కథా నాయకుడు రజనీకాంత్ ఇటీవలే 'జైలర్ 2' సినిమాని ముగించారు. దీంతో ఇప్పుడు తన తదుపరి 173వ చిత్రంపై దృష్టిసారించారు. 'తలైవర్ 173' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమాని కథానాయకుడు కమల్‌హాసన్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. సుందర్.సి ఈ చిత్ర దర్శకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాక.. శిబి చక్రవర్తిని దర్శకుడిగా ఖరారు చేశారు. కానీ, ఇప్పుడాయన కూడా వ్యక్తిగత కారణాలతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో దీన్ని తెరకెక్కించే బాధ్యతను అశ్వత్ మారిముత్తు అందిపుచ్చుకున్నట్లు సమాచారం. ఈ చిత్రం ప్రకటించినప్పుడే దీన్ని పొంగల్ బరిలో దించనున్నట్లు కమల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడీ ప్రాజెక్ట్‌లో దర్శకత్వ పరంగా కీలక మార్పులు జరిగినప్పటికీ పండగ లక్ష్యంలో ఏ మార్పు ఉండదని తెలుస్తోంది. దీనికి తగ్గట్లే అశ్వత్ జులై నుంచి చిత్రీకరణ ప్రారంభించి, వరుస షెడ్యూల్స్‌లో ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులతో పాటు పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలోనే దర్శకత్వ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని తెలిసింది. ఇక రజనీ నటించిన 'జైలర్ 2' ఆగస్టులో థియేటర్లలోకి రానున్నట్లు సమాచారం.

బెంగాల్‌లో నన్ను అడుగు పెట్టనివ్వలేదు!

'ది కశ్మీర్ ఫైల్స్' విడుదలైన తర్వాత పశ్చిమ బెంగాల్ నుంచి మమతా బెనర్జీ తనను పూర్తిగా బహిష్కరించారని అన్నారు దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి. తాజాగా జరిగిన ఎన్నికల్లో మమతా బెనర్జీ ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వివేక్ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. "ఇక ఎప్పటికీ ఇలాంటివి వద్దు. తెలియని వారి కోసం చెబుతున్నా. 'ది కశ్మీర్ ఫైల్స్' విడుదలైన తర్వాత ఆ సినిమాను థియేటర్ల నుంచి తొలగించడమే కాకుండా.. నన్ను బెంగాల్‌లో అడుగుపెట్టనివ్వనని అన్నారు మమతా బెనర్జీ. గతేడాది వచ్చిన 'ది బెంగాల్ ఫైల్స్'ను పశ్చిమ బెంగాల్‌లో పూర్తిగా నిషేధించారు. మా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. మా పై దాడి చేసి కొట్టారు.నాపై డజన్ల కొద్దీ ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. చివరికి గవర్నర్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించడానికి కూడా నేను వెళ్లలేకపోయాను. అయినా మేమెప్పుడూ వెనకడుగు వేయలేదు. ఈ ఎన్నికల సమయంలో 'ది బెంగాల్ ఫైల్స్' చిత్రాన్ని బెంగాల్ వ్యాప్తంగా సాధ్యమైనంత ఎక్కువమందికి రహస్యంగా చూపించాం. మా శక్తి మేరకు పోరాడినందుకు నాకు సంతోషంగా ఉంది. చివరగా బెంగాల్ మహనీయులకు అభినందనలు. ఇకపై అక్కడి ప్రజలు ఎలాంటి భయం లేకుండా తలెత్తి గర్వంగా నడవొచ్చ"ని ఆ వీడియోలో చెప్పారు వివేక్.

ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి దుర్మరణం

కుటుంబ కథలకు ప్రాణంపోస్తూ... తన కుటుంబాన్నే సినిమాకి అంకితం చేసిన నిర్మాత ఆర్.బి.చౌదరి(76) ఇకలేరు. రాజస్థాన్‌లోని ఉదయపుర్‌లో మంగళవారం జరిగిన కారు ప్రమాదంలో ఆయన దుర్మరణం చెందారు. ఆయన చిత్ర నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిల్మ్స్.. దశాబ్దాలుగా విలువలున్న సినిమాలకు ప్రతీకగా నిలుస్తూ ఓ బ్రాండ్‌గా మారిపోయింది. తరాలు మారినా... మాస్ మసాలా కథలు రాజ్యమేలుతున్నా సరే... కుటుంబ కథలకే పట్టం కట్టిందంటే కారణం ఆర్.బి.చౌదరి నమ్మిన సిద్ధాంతాలే.

---వంద చిత్రాలకు చేరువై...

1950లో మద్రాస్‌లో బి.ఆర్.చౌదరి, పార్వతి బాయి దంపతులకు జన్మించిన ఆర్.బి.చౌదరి అసలు పేరు రతన్ భగత్‌రామ్ చౌదరి. ఉక్కు, ఆభరణాలు, ఎగుమతుల రంగంలో వ్యాపారం ప్రారంభించిన ఆయన సినిమాల్నీ గల్ఫ్ దేశాల్లో పంపిణీ చేశారు. అలా సినిమా రంగంతో అనుబంధం ఏర్పరుచుకున్న ఆయన ఆ తర్వాత నిర్మాణంలోకి అడుగుపెట్టారు. సూపర్ ఫిల్మ్స్ పేరుతో నిర్మాణ సంస్థని ప్రారంభించి మలయాళంలో సినిమాల్ని రూపొందించారు. ఆ తర్వాత తమిళం, తెలుగు భాషల్లోకి అడుగుపెట్టారు. 1990, 2000 దశకంలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ పేరు మార్మోగిపోయింది. తెలుగులో ఎన్.వి.ప్రసాద్, శానం నాగ అశోక్ కుమార్‌తో కలిసి నిర్మించిన 'శుభాకాంక్షలు'తోపాటు, ఆ తర్వాత వచ్చిన 'సూర్యవంశం', 'సుస్వాగతం', 'రాజా', 'శీను', 'సింహరాశి', 'నువ్వు వస్తావని', 'నిన్నే ప్రేమిస్తా', 'ప్రియమైన నీకు', 'స్నేహమంటే ఇదేరా', 'శివరామరాజు', 'లవ్‌టుడే', 'సంక్రాంతి', 'గోరింటాకు' తదితర చిత్రాలు ఘన విజయాల్ని అందుకున్నాయి.

తమిళంలో నిర్మించిన చిత్రాల్ని తెలుగులో రీమేక్ చేస్తూ, తెలుగు చిత్రాల్ని తమిళంలోనూ రీమేక్ చేస్తూ ఆయన విజయాల్ని అందుకున్నారు. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, పవన్‌కల్యాణ్, రాజశేఖర్, రామ్‌చరణ్ తదితర తారలతోపాటు, యువతరం కథా నాయకులతోనూ తెలుగులో సినిమాలు నిర్మించారు. తమిళంలోనూ విజయ్‌తోపాటు పలువురు అగ్ర కథానాయకులతో సినిమాలు నిర్మించారు. దాదాపుగా నాలుగు దశాబ్దాల ప్రయాణంలో ఆర్.బి.చౌదరి వంద సినిమాలకు చేరువయ్యారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్, సూపర్‌గుడ్ కంబైన్స్, మెగా సూపర్‌గుడ్ ఫిల్మ్స్ సంస్థలపై ఆయన వరుసగా సినిమాలు నిర్మించారు. ఆయన 99వ చిత్రం 'మకుటం' విశాల్ కథా నాయకుడిగా తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఆ చిత్రం సెట్స్‌పై ఉంది.

--హీరోలుగా వారసులు

ఆర్.బి.చౌదరి కుటుంబం కూడా సినిమా రంగంలో రాణిస్తోంది. ఆయనకు నలుగురు కుమారులు సురేశ్, జీవన్, జితన్ రమేశ్, జీవా. సురేశ్ సినీ నిర్మాణంలోనే కొనసాగుతుండగా, జీవన్ ఉక్కు కంపెనీని నిర్వహిస్తున్నారు. మూడో తనయుడు జితన్ రమేశ్ కథా నాయకుడిగా, నిర్మాతగా ప్రేక్షకులకు సుపరిచితం. 'విద్యార్థి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్నీ పలకరించారు. చిన్న కుమారుడు జీవా కథానాయకుడిగా రాణిస్తున్నారు. 'రంగం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో చేరువయ్యారు జీవా. ఆయనకు భార్య మహెజబీన్ ఉన్నారు.

--ఎంతోమందికి అవకాశాలు...

కొత్తవాళ్లకు అవకాశాలు ఇవ్వడంలో ఎప్పుడూ ముందుండేవారు ఆర్.బి.చౌదరి. 'కెప్టెన్' సినిమాతో శరత్‌కుమార్‌ను కథానాయకుడిగా పరిచయం చేసింది ఆయనే. తమిళ చిత్రం 'పుదువసంతం' కొత్తవాళ్లతోనే తీశారు. ఆ చిత్రం 'నవవసంతం' పేరుతో తెలుగులోకి అనువాదమైంది. పలువురు దర్శకులు, కథానాయకులు, సాంకేతిక నిపుణులు సూపర్‌గుడ్ సంస్థల నుంచి పరిచయమై పరిశ్రమలో నిలదొక్కుకున్నారు. బుధవారం ఆయన పార్థివ దేహాన్ని చెన్నైకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం.

--ఆర్.బి.చౌదరి చిత్రసీమకు అందించిన సేవలు గుర్తుండిపోతాయి

ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి ఆకస్మిక మరణ వార్త విని మనసు కలత చెందిందని కథానాయకుడు చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ చిత్రసీమకు ఆయన చేసిన సేవల్ని మాటల్లో వర్ణించలేమని.. ఎంతోమంది ప్రతిభావంతులైన దర్శకులు, నటుల్ని తీర్చిదిద్దారని, ఎన్నో గొప్ప కథలకు జీవం పోశారని.. ఇటీవలే వారి సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో 'గాడ్ ఫాదర్' సినిమా చేశానని గుర్తు చేసుకుంటూ చిరు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. కథానాయకుడు రజనీకాంత్ స్పందిస్తూ.. ''నా ప్రియ మిత్రుడు, సూపర్ గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్.బి.చౌదరి అద్భుతమైన మానవతావాది. ఆయన ఎంతోమంది యువ దర్శకులకు అవకాశాలు కల్పించి.. చిత్ర ప్రపంచాన్ని సజీవంగా ఉంచారు. ఆయన అకాల మరణవార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది'' అని ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు.

ఆర్.బి.చౌదరి మరణం దిగ్భ్రాంతి కలిగించిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి, కథానాయకుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు ఆయనకు సంతాపం తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. ''నేను నటించిన 'సుస్వాగతం' చిత్రాన్ని ఆర్.బి.చౌదరి నిర్మించారు. అది ఘన విజయం సాధించింది. ఆయన ఎప్పుడూ కుటుంబ సమేతంగా చూడదగ్గ కథల్ని ఎంపిక చేసుకుని, చక్కటి గీతాలు ఉండేలా సినిమాల్ని నిర్మించారు. వారి సంస్థలో చేసిన 'అన్నవరం' చిత్రంలోని సిస్టర్ సెంటిమెంట్ కుటుంబ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆయన ఇటు తెలుగు, అటు తమిళ చిత్రసీమల్లో నిర్మాతగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు'' అంటూ పవన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. కథా నాయకుడు వెంకటేశ్ స్పందిస్తూ.. ''ఆర్.బి.చౌదరి మరణవార్త విని తీవ్ర దుఃఖంలో మునిగిపోయాన''ని ఆవేదన వ్యక్తం చేశారు. తామిద్దరి మధ్య ఎన్నో ఏళ్లుగా గాఢమైన వ్యక్తిగత అనుబంధం ఉందని, 'సూర్యవంశం', 'రాజా', 'శీను', 'సంక్రాంతి' లాంటి చిత్రాల కోసం సూపర్ గుడ్ ఫిల్మ్‌స్‌తో కలిసి పని చేసే అవకాశం లభించిందని చౌదరితో ఉన్న జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. సినిమా రంగానికి ఆయన చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయంటూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే కథానాయకులు విశాల్, మంచు మనోజ్, తేజ సజ్జా, దర్శకులు సౌందర్య రజనీకాంత్, కేఎస్ రవి కుమార్, అనిల్ రావిపూడి, సంపత్ నంది తదితరులు ఆర్.బి.చౌదరి మృతి పట్ల సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం ప్రకటించారు.

ఆర్‌బీ చౌదరి కృషి.. మాటల్లో చెప్పలేనిది: ప్రముఖుల సంతాపం

ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి (R B Choudary) అకాల మరణంతో చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ఉదయ్‌పుర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. ఆర్‌బీ చౌదరితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. చిత్ర పరిశ్రమకు ఎంతో కృషి చేశారంటూ కొనియాడారు.

---ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ; ''ప్రముఖ నిర్మాత, సూపర్‌గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్‌బీ చౌదరి మరణం దిగ్భ్రాంతి కలిగించింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. నేను నటించిన 'సుస్వాగతం' చిత్రాన్ని ఆయన నిర్మించారు. చిత్ర నిర్మాణం, సంబంధిత వ్యాపారంపై సాధికారత ఆయన సొంతం. కుటుంబ సమేతంగా చూడదగ్గ కథలను ఎంపిక చేసుకుని, మంచి పాటలు ఉండేలా చిత్రాలు నిర్మించారు. నేను నటించిన మరో సినిమా 'అన్నవరం'లోని సిస్టర్ సెంటిమెంట్ కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇటు తెలుగు, అటు తమిళ చిత్ర పరిశ్రమల్లో నిర్మాతగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారాయన. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా''

----చిరంజీవి ; ''లెజండరీ ప్రొడ్యూసర్ ఆర్‌బీ చౌదరి అకాల మరణ వార్త నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఆయన నాకు ఎన్నో ఏళ్లుగా పరిచయం. మేం కలిసి 'గాడ్‌ఫాదర్'కు వర్క్ చేశాం. ప్రతిభావంతులైన దర్శకులు, నటుల కెరీర్‌ను తీర్చిదిద్ది, ఎన్నో గొప్ప కథలను తెరపైకి తీసుకొచ్చారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవ మాటల్లో చెప్పలేనిది. ఆర్‌బీ చౌదరి కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలియజేస్తున్నా. ఈ కష్ట సమయంలో మనోధైర్యం కలగాలని కోరుకుంటున్నా.''

---రజనీకాంత్ ; ''నా స్నేహితుడు ఆర్‌బీ చౌదరి మంచి మనిషి. గొప్ప నిర్మాత. ఎంతోమంది యువ దర్శకులకు ఆయన అవకాశాలిచ్చారు. ఆయన మరణించారన్న వార్త దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆర్‌బీ చౌదరి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా''

--- వెంకటేశ్ ; ''ఆర్‌బీ చౌదరి విషాదకర మరణ వార్త విని, చాలా బాధపడ్డా. సూపర్ గుడ్‌ఫిల్మ్స్ బ్యానర్‌లో వచ్చిన 'సూర్యవంశం', 'రాజా', 'శీను', 'సంక్రాంతి' చిత్రాల్లో నేను నటించడం అదృష్టంగా భావిస్తున్నా. వ్యక్తిగతంగా ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది. సినిమాపై ఆయనకున్న ఆసక్తి, ఇండస్ట్రీకి ఆయన చేసిన కృషి ఎప్పటికీ నిలిచి ఉంటాయి. ఆర్‌బీ చౌదరి కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తున్నా''

---విశాల్; ''ఆర్‌బీ చౌదరి సర్ మరణ వార్త షాక్‌కు గురిచేసింది. షూటింగ్ మధ్యలో ఈ న్యూస్‌ని జీర్ణించుకోలేకపోతున్నా (ఆర్‌బీ చౌదరి నిర్మాణంలో విశాల్ ఓ సినిమాలో నటిస్తున్నారు) జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఆయన కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తున్నా''

ఓటీటీలోకి 'డెకాయిట్'

'అందరూ మహేశ్‌బాబులు అయిపోదామనే' అంటూ ఇటీవలే థియేటర్లలో సందడి చేసింది 'డెకాయిట్' చిత్రం. హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రమిది. షానియల్ డియో దర్శకత్వం వహించారు. ఇందులో హరిదాస్ పాత్రలో తన యాక్షన్‌తో ఆకట్టుకున్నారు శేష్. కళ్లతోనే హావభావాల్ని పండిస్తూ జూలియట్ పాత్రలో మృణాల్ ఒదిగిపోయింది. ఇప్పుడీ రొమాంటిక్ యాక్షన్ డ్రామా శుక్రవారం నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది.

వీళ్లంటేనే ప్రత్యేకం!

బాలీవుడ్ కథానాయిక అనన్య పాండే, లక్ష్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'చాంద్ మేరా దిల్'. ఈ రొమాంటిక్ డ్రామాకు వివేక్ సోని దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు, పోస్టర్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలోనే మరో గీతాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. ''వీళ్లకు సంబంధించిన ప్రతీ విషయం ప్రత్యేకమే'' అనే వ్యాఖ్యను జోడించింది. 'ఖసియత్..' అంటూ సాగుతున్న ఈ పాటలో లక్ష్య, అనన్యల జోడీ సరికొత్తగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. సచిన్‌జిగర్ స్వరపరిచిన ఈ గీతాన్ని రాఘవ్ చైతన్య, జోనితా గాంధీ ఆలపించారు. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 22న థియేటర్లలోకి రాబోతుంది.

బాలకృష్ణ సరసన బాలీవుడ్ అందం?

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు కొరటాల శివ కలయికలో ఓ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే దీనిపై అధికారిక ప్రకటన వచ్చేసింది. త్వరలోనే చిత్రీకరణను ప్రారంభించేందుకు తెర వెనుక సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇందులో కనిపించనున్న తారాగణమెవరన్నది ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ సినిమాకి సంబంధించి ఓ ఆసక్తికర వార్త బయటకొచ్చింది. ఇందులో బాలకృష్ణకు జోడీగా ఓ బాలీవుడ్ నాయికను రంగంలోకి దించే అవకాశమున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే విద్యాబాలన్‌తో పాటు మరో నటి పేరు ప్రచారంలో ఉంది. విద్యా ఇప్పటికే బాలయ్యతో కలిసి 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'ఎన్టీఆర్ మహానాయకుడు' చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ జోడీ మళ్లీ కొరటాల శివ సినిమాతో తిరిగి కలిసిందంటే.. దీనిపై ఉత్తరాదిలోనూ మంచి అంచనాలేర్పడే అవకాశముంది. ఇది బలమైన సామాజిక సందేశమున్న యాక్షన్ కథతో రూపొందనుందని.. దీంట్లో రాజకీయ అంశాలు మిళితమై ఉంటాయని తెలిసింది. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

'ఫౌజీ'.. తొలి పాట సన్నాహాలు

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు హను రాఘవపూడి కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'ఫౌజీ'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇమాన్వి కథానాయిక. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా నుంచి తొలి పాట వినిపించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ లిరికల్ గీతానికి సంబంధించిన పనులు మొదలయ్యాయని.. ఈనెలలోనే ఇది బయటకొచ్చే అవకాశముందని సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. ఇక మరోవైపు ఈ సినిమా ఇప్పటికే 75శాతం పైగా చిత్రీకరణ పూర్తి చేసుకుందని, మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉందని ఇటీవలే చిత్ర వర్గాల నుంచి స్పష్టత వచ్చింది. ఇది ఈ ఏడాది చివర్లో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి విశాల్ చంద్రశేఖర్ సంగీతమందిస్తుండగా.. సుదీప్ ఛటర్జీ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

జ్యోతి బృందానికి అయిదో సీడింగ్

షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 2 టోర్నమెంట్లో జ్యోతి సురేఖతో కూడిన భారత మహిళల కాంపౌండ్ జట్టు ఆశించిన ప్రదర్శన చేయలేకపోయింది. క్వాలిఫికేషన్లో 2092 పాయింట్లే సాధించిన భారత బృందానికి అయిదో సీడింగ్ వచ్చింది. సింగిల్స్లోనూ భారత అమ్మాయిలు నిరాశపరిచారు. అదితి (700) ఉత్తమంగా 13వ స్థానంలో నిలవగా.. ప్రగతి (697), జ్యోతి సురేఖ (695).. వరుసగా 19, 21వ స్థానాలు దక్కించుకున్నారు. పురుషుల కాంపౌండ్ సింగిల్స్లో మాజీ ప్రపంచ ఛాంపియన్ ఓజాస్ 711 పాయింట్లతో ఉత్తమంగా ఏడో స్థానంలో నిలిచాడు. అన్నే పాయింట్లు సాధించిన సాహిల్ జాదవ్ తర్వాతి స్థానాన్ని దక్కించుకున్నాడు. కుశాల్ దలాల్ (708).. 18వ స్థానంలో నిలవగా, అభిషేక్ వర్మ (705).. 25వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల కాంపౌండ్ టీమ్లో 2130 పాయింట్లతో భారత్ మూడో సీడింగ్ను సంపాదించింది. తుర్కియే (2134), ఫ్రాన్స్ (2132) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

అలా చేయకపోతే బహిష్కరణే

రోమ్: టెన్నిస్ గ్రాండ్స్లామ్ల ఆదాయంలో క్రీడాకారులకు ఇచ్చే వాటాను పెంచకపోతే భవిష్యత్తులో టోర్నీలను బహిష్కరించక తప్పదని ప్రపంచ నంబర్వన్ సబలెంకా హెచ్చరించింది. ఫ్రెంచ్ ఓపెన్ ప్రైజ్మనీ విషయంలో నిర్వాహకులు అనుసరిస్తున్న వైఖరిపై సబలెంకా, స్టార్ ఆటగాడు సినర్ సహా టాప్10లో ఉన్న పలువురు క్రీడాకారులు తీవ్రం అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ''మేం లేకపోతే టోర్నీలు ఉండవు. క్రీడాభిమానులకు వినోదం ఉండదు. కాబట్టి టోర్నీల ఆదాయంలో క్రీడాకారులకు దక్కాల్సిన వాటా మరింత ఎక్కువగా ఉండాలని భావిస్తున్నా. పరిస్థితులు ఇలాగే కొనసాగితే హక్కుల కోసం పోరాడే ఏకైక మార్గం టోర్నీల బహిష్కరణే'' అని సబలెంకా పేర్కొంది.

శాంసన్ దంచెన్...దిల్లీపై చెన్నై ఘనవిజయం

టోర్నీ ఆరంభంలో వరుసగా పరాభవాలు చవిచూసిన చెన్నై.. నెమ్మదిగానే అయినా, క్రమంగా పుంజుకుంటోంది. పది మ్యాచ్ల్లో అయిదో విజయంతో ఐపీఎల్ 2026లో తన ప్లేఆఫ్స్ అవకాశాలకు ఇంకాస్త బలం చేకూర్చుకుంది. ఆల్రౌండ్ ఆధిపత్యంతో సీఎస్కే.. మంగళవారం దిల్లీ క్యాపిటల్స్ను చిత్తుగా ఓడించింది. సంజు శాంసన్ అదిరే ఇన్నింగ్స్తో చెన్నై విజయంలో కీలక పాత్ర పోషించాడు. నూర్, హాసీన్తో పాటు ఇతర బౌలర్ల సూపర్ బౌలింగ్తో మొదట దిల్లీకి కళ్లెం వేసిన చెన్నై.. శాంసన్ విధ్వంసక బ్యాటింగ్తో అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. దిల్లీ పది మ్యాచ్ల్లో ఆరో ఓటమిని చవిచూసింది.

చెన్నై సూపర్కింగ్స్కు వరుసగా రెండో విజయం. సంజు శాంసన్ (87 నాటౌట్; 52 బంతుల్లో 7×4, 6×6) చెలరేగడంతో స్వల్ప స్కోర్ల మ్యాచ్లో సీఎస్కే 8 వికెట్ల తేడాతో దిల్లీని మట్టికరిపించింది. చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మొదట దిల్లీ 7 వికెట్లకు 155 పరుగులే చేయలిగింది. సమీర్ రిజ్వి (40 నాటౌట్; 24 బంతుల్లో 4×6), స్టబ్స్ (38; 31 బంతుల్లో 1×4, 2×6) మాత్రమే రాణించారు. నూర్ అహ్మద్ (2/22), అకీల్ హొసీన్ (1/19), గుర్జప్‌నీత్ (1/29) గొప్పగా బౌలింగ్ చేశారు. శాంసన్తో పాటు కార్తీక్ శర్మ (41 నాటౌట్; 31 బంతుల్లో 4×4, 2×6) రాణించడంతో లక్ష్యాన్ని చెన్నై 17.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది.

సంజు దంచేశాడు:

చెన్నై ఛేదనలో సంజు శాంసన్ ఆటే హైలైట్. మొదట్లో జాగ్రత్తగా ఆడిన అతడు.. క్రమంగా చెలరేగిపోయాడు. రుతురాజ్తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన శాంసన్.. రెండో ఓవర్లో అక్షర్ బౌలింగ్లో ఓ సిక్స్ కొట్టినా.. సంయమనాన్ని పాటించాడు. రుతురాజ్ (6) ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఉర్విల్ పటేల్ (17) రెండు సిక్స్లు బాదినా, త్వరగానే ఔటయ్యాడు. ఏడో ఓవర్లో అతడు నిష్క్రమించడంతో చెన్నై 45/2తో నిలిచింది. కానీ ఎదుర్కొన్న తొలి 17 బంతుల్లో 15 పరుగులే చేసిన శాంసన్.. నిలదొక్కుకున్నాక ధనాధన్ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కార్తీక్ శర్మ అతడికి అండగా నిలిచాడు. కుల్‌దీప్ బంతిని డీప్ మిడ్ వికెట్లో స్టాండ్స్లోకి పంపిన శాంసన్.. నటరాజన్ బౌలింగ్లో వరుసగా రెండు సిక్స్లు, మళ్లీ కుల్‌దీప్ ఓవర్లో వరుసగా 6, 6, 4తో విరుచుకుపడ్డాడు. స్టార్క్‌నూ రెండు ఫోర్లతో శిక్షించాడు. సమీకరణం తేలికైపోయింది. చెన్నై విజయానికి చివరి ఏడు ఓవర్లలో కావాల్సింది 51 పరుగులే. కార్తీక్ వేగంగా ఆడకపోయినా, శాంసన్ దూకుడు వల్ల చెన్నైకి ఇబ్బందిలేకపోయింది. కళ్లు చెదిరే షాట్లు ఆడిన శాంసన్.. నటరాజన్ ఓవర్లో వరుసగా 6, 6, 4.. ఎంగిడి ఓవర్లో రెండు ఫోర్లతో లక్ష్యాన్ని మరింత తేలికగా మార్చాడు. 16వ ఓవర్లో 138/2తో నిలిచింది చెన్నై. ఆ తర్వాత గెలుపు లాంఛనమే. మిగిలిన ఆసక్తి శాంసన్ సెంచరీ చేస్తాడా లేదా అన్నదే. అతడికి సెంచరీ సాధ్యం కాలేదు కానీ.. కార్తీక్ ఆఖర్లో చక్కని షాట్లతో అలరించాడు.

దిల్లీకి కళ్లెం: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దిల్లీ.. ఇన్నింగ్స్ను పేలవంగా ఆరంభించింది. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన చెన్నై, క్రమం తప్పకుండా వికెట్లు తీసింది. భాగస్వామ్యాలు నమోదు కానివ్వలేదు. స్పిన్నర్లకు సహకరించిన పిచ్పై దిల్లీ బ్యాటర్లు తమను తాము అన్వయించుకోలేకపోయారు. 11 ఓవర్లలో 69 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయి.. ఆ జట్టు చిక్కుల్లో పడింది. ఏ దశలోనూ ఇన్నింగ్స్లో ఊపులేదు. కొన్ని చక్కని షాట్లు ఆడిన ఓపెనర్ నిశాంక (19)ను నాలుగో ఓవర్లో ముకేశ్ చౌదరి ఔట్ చేయడంతో మొదలైంది దిల్లీ పతనం. ధాటిగా ఆడలేకపోయిన మరో ఓపెనర్ రాహుల్ (12)ను ఆరో ఓవర్లో స్పిన్నర్ హొసీన్ వెనక్కి పంపాడు. కరుణ్ నాయర్ (13) కూడా ఎక్కువసేపు నిలువలేకపోయాడు. అతణ్ని, నితీశ్ రాణా (15)ను తన వరుస ఓవర్లలో ఔట్ చేసి మరోస్పిన్నర్ నూర్.. దిల్లీని దెబ్బతీశాడు. స్టబ్స్ కూడా వెంటనే ఔట్ కావాల్సింది. కానీ గుర్జప్‌నీత్ బౌలింగ్లో నూర్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయాడు. కెప్టెన్ అక్షర్ పటేల్ (2)కు మాత్రం అలా కలిసి రాలేదు. అదే ఓవర్లో షార్ట్ పిచ్ బంతిని ఆడిన అతడు.. హొసీన్కు చిక్కి వెనుదిరిగాడు. తక్కువ స్కోరుకే సగం వికెట్లు కోల్పోయిన దిల్లీని స్టబ్స్, రిజ్వీ ఆదుకున్నారు. ఆరో వికెట్కు 65 పరుగులు జోడించి ఇన్నింగ్స్ను చక్కదిద్దారు. గుర్జప్‌నీత్ ఓవర్లో స్టబ్స్ సిక్స్ కొట్టగా.. ముకేశ్ బౌలింగ్లో ఓ సిక్స్, కాంబోజ్ బౌలింగ్లో రెండు సిక్స్లు కొట్టాడు రిజ్వీ. 19వ ఓవర్లో స్టబ్స్ వెనుదిరగడంతో భాగస్వామ్యం విడిపోయింది. అశుతోష్ రెండు సిక్స్లు, రిజ్వి ఓ సిక్స్ బాదడంతో ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో కాంబోజ్ 20 పరుగులు సమర్పించుకున్నాడు. ఆఖరి మూడు ఓవర్లలో దిల్లీ 39 పరుగులు రాబట్టింది.

దిల్లీ ఇన్నింగ్స్: నిశాంక (సి) బ్రెవిస్ (బి) ముకేశ్ 19; రాహుల్ (సి) రుతురాజ్ (బి) హొసీన్ 12; నితీశ్ రాణా (సి) కార్తీక్ శర్మ (బి) నూర్ 15; కరుణ్ నాయర్ (సి) గుర్జప్‌నీత్ (బి) నూర్ 13; అక్షర్ (సి) హొసీన్ (బి) గుర్జప్‌నీత్ 2; స్టబ్స్ (సి) ముకేశ్ (బి) ఒవర్టన్ 38; రిజ్వి నాటౌట్ 40; అశుతోష్ రనౌట్ 14; స్టార్క్ నాటౌట్ 0; ఎక్స్ట్రాలు 2 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 155

వికెట్ల పతనం: 1-29, 2-36, 3-52, 4-61, 5-69, 6134, 7149

బౌలింగ్: అకీల్ హొసీన్ 4-0-19-1; ముకేశ్ 4-0-31-1; అన్షుల్ కాంబోజ్ 4-0-49-0; నూర్ అహ్మద్ 3-0-2-2; గుర్జప్‌నీత్ 4-02-9-1; ఒవర్టన్ 1-0-5-1

చెన్నై ఇన్నింగ్స్: శాంసన్ నాటౌట్ 87; రుతురాజ్ (సి) రిజ్వి (బి) ఎంగిడి 6; ఉర్విల్ (స్టంప్డ్) రాహుల్ (బి) అక్షర్ 17; కార్తీక్ శర్మ నాటౌట్ 41; ఎక్స్ట్రాలు 8; మొత్తం: (17.3 ఓవర్లలో 2 వికెట్లకు) 159

వికెట్ల పతనం: 124, 245

బౌలింగ్: స్టార్క్ 4-0-30-0; అక్షర్ 4-0-25-1; ఎంగిడి 4-0-30-1; కుల్‌దీప్ 3-0-34-0; నటరాజన్ 2.3-0-39-0

రాయుడి చేతికి క్రికెట్ పగ్గాలు

హెచ్సీఏ ఆపరేషన్స్ హెడ్గా నియామకం

హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్సీఏ)లో పాలనను మెరుగుపరచడంతో పాటు పారదర్శకతను పెంచే దిశగా అపెక్స్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలోని ఏకసభ్య కమిటీ పర్యవేక్షణలో.. క్రికెట్ అభివృద్ధికి, ఆట ప్రమాణాల పెంపునకు సమగ్రమైన కార్యాచరణను ప్రకటించింది. ఇందులో భాగంగా హెచ్సీఏ క్రికెట్ ఆపరేషన్స్ హెడ్గా భారత మాజీ ఆటగాడు అంబటి రాయుడును నియమించింది. హెచ్సీఏకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాయుడుకు కీలక బాధ్యతలు అప్పగించింది. మూడేళ్ల కాలానికి ఒప్పందంపై సంతకం చేసిన రాయుడు.. హెచ్సీఏ నుంచి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు తీసుకోకుండా సేవలు అందించనున్నాడు. మంగళవారమే బాధ్యతలు స్వీకరించిన రాయుడు.. శిక్షణ, సెలక్షన్స్, ప్రతిభాన్వేషణ సహా అన్ని వ్యవహారాలను చూసుకుంటాడని హెచ్సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్, కార్యదర్శి జీవన్‌రెడ్డి వెల్లడించారు. ''క్రికెట్ను పరిపాలన నుంచి వేరుగా ఉంచాలని నేను గట్టిగా నమ్ముతా. ఆటగాళ్ల సంక్షేమాన్ని చూసుకోవడం.. హైదరాబాద్కు నిజంగా దక్కాల్సిన గుర్తింపు తీసుకురావడం నా పని. ఎంతోమంది అంతర్జాతీయ క్రికెటర్లను తయారు చేసే కేంద్రంగా హైదరాబాద్ను తీర్చిదిద్దాలి. అవినీతి రహిత క్రికెట్ నా లక్ష్యం. ఆటలో అవినీతిని ఉపేక్షించను.

అవినీతి నిరోధక యూనిట్ (ఏసీయూ), ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఆటగాళ్లు లేదా ఇంకెవరైనా టోల్ ఫ్రీ నంబరు, ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. దోషిగా తేలిన వారిని ఏసీయూ, బీసీసీఐకి నివేదించి బ్లాక్లిస్ట్లో పెడతాం. అది ఆటగాడు, తల్లిదండ్రులు, సెలక్టర్, అంపైర్ ఎవరైనా సరే అవినీతికి దూరంగా ఉండేలా ఏసీయూ చూసుకుంటుంది. ముంబయి క్రికెట్ సంఘం ఇటీవల ప్రకటించిన ఆటగాళ్ల కాంట్రాక్ట్ విధానాన్ని అమల్లోకి తెస్తాం. సెలక్షన్ కమిటీలో సరైన వ్యక్తులతో ప్రతిభ ఆధారంగా ఎంపికలు ఉంటాయి. కేవలం లీగ్స్ ప్రదర్శనల ఆధారంగానే కాకుండా ఓపెన్ ట్రయల్స్ ద్వారా కూడా జట్లను ఎంపిక చేస్తాం. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను ఏర్పాటు చేయాలని.. జిల్లాల క్రికెటర్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని భావిస్తున్నాం'' అని రాయుడు తెలిపాడు. ఏసీయూకు జిల్లా మాజీ జడ్జి విజేందర్ పింగ్లే ఛైర్మన్గా వ్యవహరిస్తారు. మహిళా క్రికెటర్లు, సిబ్బందికి సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు 'పోష్' (లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013) కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

హార్దిక్ ఒంటరయ్యాడా...

ఐపీఎల్లో ఒకప్పుడు హార్దిక్ పాండ్య మేటి ఆల్రౌండర్. ఆటగాడిగా ముంబయికి ఎన్నో విజయాలందించాడు. తర్వాత కెప్టెన్సీ అందుకున్న తొలి సీజన్లోనే గుజరాత్కు ట్రోఫీ అందించాడు. ఆపై తన తొలి జట్టు ముంబయికి తిరిగొచ్చాడు. కెప్టెన్సీ చేపట్టాడు. కానీ పునరాగమనంలో ఆల్రౌండర్గా తన పాతకు న్యాయం చేయడంలో, జట్టును ఏకతాటిపై నడిపించడంలో ఘోరంగా విఫలమవుతున్నాడు. ఈ సీజన్లో ముంబయి ఘోర వైఫల్యం నేపథ్యంలో అభిమానులు, విమర్శకుల వేళ్లన్నీ హార్దిక్ పాండ్య వైపే చూపిస్తున్నాయి. హార్దిక్ దూరమైన మ్యాచ్లో ముంబయి చక్కటి ప్రదర్శనతో విజయం సాధించడంతో జట్టులో అతడు ఒంటరయ్యాడా అనే సందేహాలు కలుగుతున్నాయి.

ఐపీఎల్లో అరంగేట్రం చేసిన కొన్నేళ్లలో భారత అత్యుత్తమ ఆల్రౌండర్గా పేరు సంపాదించాడు హార్దిక్ పాండ్య. ముంబయి దుర్భేద్యమైన జట్టుగా ఎదగడంలో, నిలకడగా టైటిళ్లు గెలవడంలో అతడి పాత్ర కీలకం. అయితే తనలో ఒక సమర్థుడైన కెప్టెన్ కూడా ఉన్నాడని 2022లో రుజువు చేశాడు హార్దిక్. అప్పుడే ఐపీఎల్లోకి అడుగు పెట్టిన గుజరాత్కు టైటిల్ అందించి అబ్బురపరిచాడు. ఆల్రౌండర్గానూ తన పాత్రను అద్భుతంగా నిర్వర్తించాడు. రెండో సీజన్లోనూ జీటీని రన్నరప్గా నిలిపాడు. అనంతరం కెప్టెన్సీ ఇవ్వాలనే షరతుపై.. తను అరంగేట్రం చేసిన ముంబయి ఇండియన్స్కు తిరిగొచ్చాడు. ఐపీఎల్లో అత్యంత విజయవంతమైన కెప్టెన్ రోహిత్ శర్మ నుంచి జట్టు పగ్గాలు అందుకున్న హార్దిక్.. మొదట్లో అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నాడు. సొంత జట్టు అభిమానులు, సొంత మైదానం (వాంఖడే)లో అతణ్ని ఎగతాళి చేశారు. ఆ సీజన్లో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న హార్దిక్.. జట్టును సరైన దారిలో నడిపించలేకపోయాడు. కానీ గత ఏడాది ముంబయిని ప్లేఆఫ్స్కు తీసుకెళ్లగలిగాడు. దీంతో హార్దిక్ గాడినపడ్డట్లే కనిపించాడు. కానీ ఈసారి మళ్లీ ఆ జట్టు దారుణ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో కొట్టుమిట్టాడుతోంది. హార్దిక్ ఇప్పటిదాకా ముంబయికి 37 మ్యాచ్ల్లో సారథ్యం వహించగా.. అందులో ఆ జట్టు 14 మాత్రమే గెలిచింది. గుజరాత్కు రెండు సీజన్లలో కలిపి పాండ్య 32 మ్యాచ్ల్లో 23 విజయాలు అందించాడు. హార్దిక్‌ను సారథి చేయడం ఆ జట్టులోని కొందరికి మింగుడుపడలేదనే వార్తలు అప్పట్లో వినిపించాయి. కెప్టెన్సీ కోల్పోయాక రోహిత్ ఎప్పుడూ జట్టులో అంతర్భాగంగా లేడు! అతడికి తగ్గ గౌరవాన్ని జట్టు యాజమాన్యం, హార్దిక్ ఇస్తున్నట్లు కనిపించడం లేదు. నిరుడు రోహిత్‌ను ఇంపాక్ట్ ప్లేయర్గా ఆడించడం చర్చనీయాంశమైంది. ఈసారి అతడు గాయంతో అయిదు మ్యాచ్లకు అందుబాటులో లేకుండాపోయాడు. సోమవారమే పునరాగమనం చేశాడు. మరోవైపు బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ లాంటి సీనియర్లు హార్దిక్తో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే వార్తలూ వస్తున్నాయి. కొన్ని మ్యాచ్ల్లో బుమ్రాకు కొత్త బంతి అందివ్వకపోవడం హార్దిక్కు అతడితో సమన్వయ లోపాన్ని తెలియజేస్తోంది. డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం కూడా బాలేదని అర్థమవుతోంది. పోనీ సరైన ఆటగాళ్లు లేరా అంటే అదీ కాదు. రోహిత్, బుమ్రా, సూర్యకుమార్, తిలక్, బౌల్ట్, డికాక్, రికెల్టన్ ఇలా జట్టు నిండా స్టార్లే. కానీ వారి నుంచి ప్రదర్శన రాబట్టేలా హార్దిక్ స్ఫూర్తిని నింపలేకపోతున్నాడని స్పష్టమవుతోంది. బుమ్రా, సూర్యకుమార్, తిలక్ వారి స్థాయిలో ఆడకపోవడం జట్టును దెబ్బ తీసింది. భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారి ఇటీవల మాట్లాడుతూ.. జట్టులోని ఆటగాళ్ల నుంచి హార్దిక్కు కావాల్సిన మద్దతు అందడం లేదన్నాడు. దీంతో హార్దిక్ జట్టులో ఒంటరయ్యాడా? ఎవరూ అతడికి సహకరించడం లేదా? అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. మరోవైపు అతడు వ్యక్తిగతంగానైనా రాణిస్తున్నాడా అంటే అదీ లేదు. గుజరాత్ టైటాన్స్లో ఉన్నప్పుడు 30 ఇన్నింగ్స్ల్లో ఆరు అర్ధసెంచరీలు సహా 833 పరుగులు చేసి, 11 వికెట్లు పడగొట్టాడు. ముంబయికి వచ్చాక గత రెండు సీజన్లు కలిపి 25 ఇన్నింగ్స్ల్లో 440 పరుగులే చేశాడు. 11 వికెట్లు తీశాడు. ఈ సీజన్లో అతడు బ్యాటుతో, బంతితో ఘోరంగా విఫలమవుతున్నాడు. 9 మ్యాచ్ల్లో 146 పరుగులే చేసి, కేవలం 4 వికెట్లే పడగొట్టాడు. స్ట్రైక్‌రేట్ గణనీయంగా పడిపోయింది. పరుగుల కోసం ఆపసోపాలుపడుతున్నాడు. చెన్నైపై అతడి ఇన్నింగ్స్ (23 బంతుల్లో 18) అయితే పేలవం. ఈ ఐపీఎల్లో ఆర్సీబీపై చేసిన 40 పరుగులే హార్దిక్ అత్యధిక స్కోరు. హార్దిక్ వైఫల్యం, జట్టు ఘోర ప్రదర్శన, డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం సరిగా లేకపోవడం.. వీటన్నిటి నేపథ్యంలో సోమవారం లఖ్‌నవూతో మ్యాచ్లో హార్దిక్ ఆడకపోవడం అనుమానాలకు దారి తీసింది. సూర్యకుమార్ అన్నట్లు నిజంగానే అతను గాయపడ్డాడా? లేక అతడిని పక్కన పెట్టారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. తర్వాతి మ్యాచ్కు అందుబాటులోకి రాకపోతే.. హార్దిక్పై వేటు పడిందనే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

సన్‌రైజర్స్ కు పంజాబ్ సవాల్

హైదరాబాద్: ఐపీఎల్లో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్, మూడో స్థానంలో కొనసాగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ బుధవారం ఉప్పల్ స్టేడియంలో అమీతుమీ తేల్చుకోనున్నాయి. సొంతగడ్డపై గత మ్యాచ్ వైఫల్యాన్ని అధిగమించాలని సన్‌రైజర్స్ భావిస్తుండగా.. వరుసగా రెండు పరాజయాలతో దెబ్బతిన్న పంజాబ్ మళ్లీ గెలుపు బాట పట్టాలని కృతనిశ్చయంతో ఉంది. వరుసగా అయిదు విజయాలతో జోరు మీద కనిపించిన సన్‌రైజర్స్కు కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఊహించని పరాజయం మేలుకొలుపు లాంటిదే. ఆ మ్యాచ్లో అభిషేక్, క్లాసెన్ ఇద్దరూ విఫలమవడం సన్‌రైజర్స్ను దెబ్బతీసింది. అయితే ట్రావిస్ హెడ్ వరుసగా రెండో అర్ధ సెంచరీతో రాణించడం.. ఇషాన్ కిషన్ గాడినపడటం జట్టుకు సానుకూలాంశమే. గత మ్యాచ్కు దూరమైన ఆల్రౌండర్ నితీశ్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. కెప్టెన్ కమిన్స్, ఇషాన్ మలింగ, సకిబ్ హుస్సేన్, శివాంగ్‌కుమార్‌లతో బౌలింగ్ పటిష్టంగా ఉంది. 9 మ్యాచ్ల్లో 13 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న పంజాబ్.. గత రెండు ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని గెలుపు బాట పట్టాలని చూస్తోంది.

రోహిత్ ఫామ్లో ఉంటే అనేక జట్ల ప్లే ఆఫ్స్ ఆశలు గల్లంతు: గావస్కర్

ఐపీఎల్ 2026 కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే నాలుగు జట్లు 10 మ్యాచ్లు, ఆరుజట్లు తొమ్మిదేసి మ్యాచ్లు ఆడేశాయి. ఇకపై జరిగే మ్యాచ్ల ఫలితాలు ఆయా జట్ల ప్లే ఆఫ్స్ అవకాశాలను ప్రభావితం చేస్తాయి. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్తో జరిగిన మ్యాచ్తో రీ ఎంట్రీ ఇచ్చిన ముంబయి బ్యాటర్ రోహిత్ శర్మ అదరగొట్టాడు. తనదైన శైలిలో విరుచుకుపడుతూ ప్రత్యర్థి జట్టు బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ మ్యాచ్లో హిట్‌మ్యాన్ 44 బంతుల్లోనే 84 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. రోహిత్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే కొన్ని జట్ల ప్లే ఆఫ్స్ అవకాశాలకు గండిపడుతుందని భారత మాజీ బ్యాటర్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. రోహిత్ ఫామ్ లీగ్ ఆఖరి దశలో ముంబయిని ప్రమాదకర ప్రత్యర్థిగా మార్చగలదని ఆయన పేర్కొన్నారు. ''గత ఏడాదిగా రోహిత్ శర్మను నిశితంగా గమనిస్తున్నాను. పరిమిత ఓవర్ల క్రికెట్, ఐపీఎల్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకొన్న తర్వాత తన బ్యాటింగ్పైనే ఎక్కువ దృష్టి సారించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్లో పరుగులు సాధించాడు, స్వదేశంలో జరిగిన సిరీస్లోనూ రాణించాడు. ఇప్పుడు ఐపీఎల్లో కూడా అదే జోరు కొనసాగిస్తున్నాడు. రోహిత్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే మిగిలిన మ్యాచ్లలో ముంబయి ఇండియన్స్ అనేక జట్ల ప్లేఆఫ్ ఆశలకు గట్టి దెబ్బ కొడుతుంది. ప్రతి ఐపీఎల్ సీజన్లో అతను 400 నుంచి 500 పరుగులు చేస్తాడు. రోహిత్ 80కిపైగా పరుగులు చేసిన ఇన్నింగ్స్లు ఎక్కువగా ఉండవు. కానీ, అతను చేసే 4050 పరుగులు జట్టుకు శుభారంభాన్నిస్తాయి. అతని ఆటలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు రోహిత్ మరింతసేపు బ్యాటింగ్ చేసి తనదైన ముద్రను బలంగా వేయాలనుకుంటున్నాడు'' అని సన్నీ వివరించారు.

రూ. 27 కోట్లకు పంత్ న్యాయం చేయట్లేదని విమర్శలు.. కోచ్ రియాక్షన్ ఇదే

ప్రస్తుతం ఆరు పాయింట్లతో ఉన్న ముంబయికి ప్లే ఆఫ్స్ అవకాశాలు పెద్దగా లేవు. ఆ జట్టు నాలుగో స్థానానికి చేరుకోవాలంటే తమ మిగిలిన నాలుగు మ్యాచ్ల్లోనూ తప్పక గెలవాలి. అంతేకాదు ఇతర జట్ల ఫలితాలు కలిసొస్తేనే ముంబయి ముందడుగు వేసే ఛాన్స్ ఉంటుంది. ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్తో ముంబయి మ్యాచ్లు ఆడాల్సి ఉంది. ఈ సీజన్లో రోహిత్ శర్మ ఇప్పటివరకు 5 మ్యాచ్ల్లో 174.02 స్ట్రైక్‌రేట్తో 221 పరుగులు చేశాడు. మిగతా మ్యాచ్ల్లోనూ హిట్‌మ్యాన్ రాణించాలని అభిమానులు కోరుకుంటున్నారు.